ప్రత్యేక సంచిక

స్వర్ణదినం

అఖిల

అఖిల భారత పత్రిక — ఫిబ్రవరి 2012

స్వర్ణదినం — 29 ఫిబ్రవరి

శ్రీమాతారవిందుల రచనల సంకలనం

విషయసూచిక

ఫిబ్రవరి 29, శ్రీమాత "భూమిపై దివ్యమానస ఆవిర్భావము" గా పేర్కొన్న ఆధ్యాత్మిక ఘటన స్మారక దినోత్సవము. పృథ్వి యొక్క ఆధ్యాత్మిక చరిత్ర యందలి ఐతిహాసిక ప్రాముఖ్యతగల ఈ ఘటన కోసమే శ్రీమాతారవిందులు శతాబ్దాల తరబడి కృషి సలిపారు. దాని ఆగమనాన్ని వేగవంతం చేయడానికే శ్రీఅరవిందులు 1950 లో శరీరత్యాగం చేసింది.




దైవానుగ్రహ ఘడియ

మనుషుల యందు దైవశక్తి ప్రసరించే మహత్తర క్షణాలు కొన్ని ఉంటాయి. ఆ తరుణంలో భగవంతుని ఉచ్ఛ్వాసనిశ్వాసాలు మన అస్తిత్వపు ప్రవృత్తిపై విస్తారంగా వీస్తుంటాయి. కొన్ని సమయాల్లో దైవశక్తి ప్రసరణ మందగిస్తుంది. అప్పుడు మనుషులు వారి వారి స్వీయశక్త్యానుసారం లేక బలహీనతకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. మొదటిది, అత్యల్ప ప్రయత్నంతో అసాధారణ ఫలితాలు దక్కే దశ, భవితవ్యాన్ని మార్చగలిగే దశ. రెండవది, అత్యల్ప ఫలితం కోసం అత్యంత ప్రయాస కోర్వవలసిన

దశ. మొదటి దశను రెండవ దశ సిద్ధింపచేయవచ్చుననుట వాస్తవమే. ఎలాగంటే హోమగుండం నుండి స్వర్గలోక దిశగా సన్నగా సాగే ధూమశిఖలు దైవానుగ్రహాన్ని పుష్కలంగా వర్షింపజేస్తాయి అన్నట్లుగా. దివ్యముహూర్త మాసన్న మైనప్పుడు ఏ మనిషైనా, ఏ దేశమైనా నిద్రలో మునిగి దానిని స్వీకరించి ఉపయోగించటానికి ఆయత్తమై ఉండవో, అవి అత్యంత దురదృష్టకరమైనవి. కారణం, వాటి జ్యోతి కొడిగట్టి మసకబారి దైవానుగ్రహాన్ని సాదరంగా ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండలేక పోవుటయే; వాటి శ్రవణేంద్రియాలు మూతవడి ఆ పిలుపు నందుకొనుటకు నిరుప యోగమగుటయే. కాని శక్తిమంతమై, సంసిద్ధులుగానున్నప్పటికీ ఆ మహత్తర శక్తిని వృధాపరిచినా లేక ఆ మహాద్భుత ముహూర్తాన్ని నిరుపయోగపరిచినా వారు దుఃఖాక్రాంతులుగ మిగిలిపోవుట తథ్యము.

ఆ దైవానుగ్రహ ఘడియలో నీ జీవాత్మలోకి తిన్నగా దృష్టిని సారించుటకు, దానిని ఆదేశించు గళాన్ని వినుటకు వీలుగా ఆత్మవంచన, దంభాచారము, పనికిమాలిన ఆత్మస్తుతి నుండి నీ అంతరాత్మను ప్రక్షాళన గావించు. ఏ స్వభావ కాపట్యమైతే ఒకప్పుడు నీకు ప్రభువు యొక్క దృష్టి నుండి, ఆదర్శజ్యోతి నుండి నీకు రక్షణ కల్పించిందో అది ఇప్పుడు నీ రక్షణ కవచాన్ని బీటలుబారునట్లు చేసి ఘోర శరా ఘాతములను ఆహ్వానిస్తుంది. ఈ క్షణాన, క్షణికంగా నీవు జయించవచ్చు. కాని అది నీకు భంగపాటే. ఎందుకనగా విపత్తు ఆ తర్వాత దాపురించి నీ విజయోత్సవ సంబరాల మధ్యలో నిన్ను కూల్చివేస్తుంది. కావున పవిత్రంగా నుండి భయాందోళనలను ప్రక్కకు నెట్టివేయి. కారణం, ఆ విపత్కర ఘడియ అతి భయంకరంగా ఉంటుంది. అదొక అగ్నిగుండం, ఒక సుడిగాలి, ఒక తుఫాను. మర ఆడించి ద్రాక్షాసారమును తీయు విధంగా, భగవదాగ్రహాన్ని ఆహ్వానించునట్లుంటుంది. కాని ఎవరైతే తమ లక్ష్యము యొక్క వాస్తవికతను ఆలంబనగా చేసుకుని ఆ ధాటిని తట్టుకుని నిలబడగలరో, అతడే స్థిరంగా నిలదొక్కుకోగలడు. ఒకవేళ అతడు పడిపోయినా, తిరిగి లేచి నిల బడగలడు. పెనుగాలి వాటానికి కొట్టుకొనిపోయినట్లు కనుపించినా తిరిగి యథాస్థానానికి చేరగలడు. ప్రాపంచిక పరిజ్ఞానము యొక్క గుసగుసలకు నీ చెవులను పూర్తిగా అప్పగించకు. ఎందుకనగా, అది ఒక అనూహ్యమైన, అనిశ్చితమైన, అపరిమితమైన దానికి చెందిన సమయము. దైవశ్వాస యొక్క శక్తిని చౌకబారు ఉపకరణాలతో అంచనా వేయుటకు బదులు, దానిని విశ్వసించు, ముందుకు సాగిపో.



శ్రీమాత

అయినా, అన్నింటిని మించి నీ అంతరాత్మకు అహంకార ఆరడులను అంట నీయకు. ఆ స్థితిని కొంతవరకైనా నిలుపుకో. అప్పుడు ప్రకాశవంతమైన వెలుగు ఒకటి అజ్ఞానాంధకార చీకట్లలో, పెనుతుఫాను ఘోషలో నీ ముందు ప్రగతి పథంలో పయనిస్తూ నీకు బాసటగా నిలుస్తుంది. నీవు అధిరోహించవలసిన గొప్పతనపు మహోన్నత శిఖరాగ్రంపై నీ విజయపతాకం రెపరెప లాడుతుంది.

మూలం: శ్రీఅరవిందులు (*CWSA* Vol. 12, pp. 146-47)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మనదొక అత్యద్భుత అతీతస్థితి — దైవానుగ్రహం తోడుంది.

మానవజాతి చరిత్రను, మానవాళికి సాయపడుటకు అవతరించినవారి కథలను చదువు తున్నప్పుడు ఇట్టి అనుభవం మీకు కలిగిందేమో నాకు తెలియదు. ఇట్టిది ఇతర దేశప్రజల కన్న ఎక్కువగ భారతదేశంలోనే మీరు విని ఉంటారు. ఆ కథలలో ఊర్ధ్వ లోకాల జోక్యం గురించి, అలాంటి అవకాశం గురించి ఒక అత్యద్భుత అతీత దైవానుగ్రహం గురించిన ప్రశంస ఉంటుంది.

అందువలన, ఎవరైనా పిన్నవయసులో ఆ కథలను చదివినప్పుడు వారు అనుకుం టారు. "ఓహ్, ఆ కాలంలో జీవించి ఉంటే ఎంత బాగుండేది!" అని. ఆ అనుభవం మీకు కలిగిందేమో నాకు తెలియదు.

ఆ అనుభవం పొందినవారు నాకు తెలుసు. అలాంటివారిని ఎవరైనా, "సరే, అలాంటి అవకాశం నీకు కలిగిందనుకో. అప్పుడు నీ ప్రతిస్పందన ఎలా ఉంటుంది?" అని అడిగితే, కొన్నిసార్లు వారు వెంటనే గ్రహించగలుగుతారు; వారికి హఠాత్తుగా స్వర్గద్వారాలు తెరువబడినట్లనిపిస్తుంది; ఒకటి ఏదో, అంతకు పూర్వం లేనిది, సాక్షాత్క రించినట్లనిపిస్తుంది. ఆ భావన ఎంతకాలముంటుందో ఎవరూ చెప్పలేరు. ఏది ఏమయినా అవి పృథ్వీజీవితంలోను, మానవజీవితంలోను చోటు చేసుకునే అపూర్వ క్షణాలు, ఆ తరుణంలో పరిస్థితులు మామూలుగా మందకొడిగ, నిర్జీవంగ ఉన్నట్టుగా

ఉండవు. అందువల్ల వ్యక్తికి ఒక అత్యద్భుత అతీతస్థితిలో నున్నట్టు భావన కలుగుతుంది.

ఆ భావనాస్థితిని స్థిరంగా నిలుపుకోగలిగితే అంతా సవ్యంగా సాగిపోతుంది. కాని దురదృష్టం ఏమిటంటే, వ్యక్తి దానిని అతి త్వరగా మరచిపోతాడు.

ఆ స్థితి ఒక్కసారి గనుక కలిగినట్లయితే కొంత సాఫల్యత సిద్ధించినట్లే. ద్వారం తెలువబడిందన్న మాట. హఠాత్తుగ వ్యక్తికి అనుభూతి కలిగింది.... అవును, అనుభూతి పొందాడు. అది ఎంతో కొంత సాధించినట్లే. అది ఒక అపారమైన దైవానుగ్రహం, ఒక విధమైన అత్యద్భుతస్థితి. శతాబ్దపూర్వం లేక రెండు, మూడు శతాబ్దాల పూర్వం, దానిని ఆశించారు. దాని కోసం నిరీక్షించారు. వారికి ఒకే ఒక అవకాశం ఉండింది. మరో జన్మనెత్తి, క్రొత్త జీవితంలో మెరుగైన పరిస్థితుల్లో మనుగడ సాగించగలిగే అవకాశం.

కాని ప్రస్తుతం, మనకు ఆ పరిస్థితులున్నాయి. ఆ పరిస్థితులు మనకందుబాటులో ఉన్నాయి. దైవానుగ్రహం తోడుంది.

ఎవరైనా ఈ అనుభవం ఎలాగైనా పొందగలిగితే — కేవలం భావనామాత్రంగా కాదు — క్రియాశీల అనుభవం పొందగలిగి, తదుపరి దానిని నిలుపుకోగలిగితే, అప్పుడు అంతా సులభతరమౌతుంది. దురదృష్టవశాత్తు దానిని అతి త్వరగా మరచిపోతారు.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

> మరో కొత్త మతం ఎందుకూ పనికి రానిదే కాదు, హానికరం కూడాను. ఇప్పుడు కావలసింది నూతన జీవితాన్ని సృష్టించడం, నూతన చైతన్యాన్ని వ్యక్తపరచడం. అది మేధోపరిమితులను, మానసిక సూత్రాలను అధిగమించినది. ఇప్పుడు అభివ్యక్తి కావలసినది ఒక సజీవమైన సత్యం.
>
> ది మదర్

ఫిబ్రవరి 29, 1956 న జరిగిందేమిటి?

29 ఫిబ్రవరి 1956

బుధవారం నాటి సామూహిక ధ్యాన సమయంలో

ఈ సాయంత్రం ఒక సారూప్యమైన, ఆదిభౌతికమైన భగవంతుని ఉనికి మీలో ఉండినది. నేను విశ్వాన్ని మించిన సజీవ స్వర్ణాకృతిని దాల్చి, ఈ ప్రపంచాన్ని దైవం నుండి వేరుపరచే బంగారు ద్వారం ముందు నిలిచాను.

ఆ ద్వారాన్ని వీక్షిస్తున్నప్పుడు నా చైతన్యమందు ఉదయించిన ఒక కదలికలో నేను సంకల్పించాను, నాకు అవగతమైంది, "సమయం ఆసన్నమైనది" అని. రెండు చేతులతో ఒక పెద్ద బంగరు సమ్మెటను ఎత్తి ఆ ద్వారంపై ఒక్క మారు మోదాను. ఒకే ఒక్క మారు. ద్వారం తునాతునకలైపోయింది.

అప్పుడు దివ్యచైతన్య కాంతి, దివ్యశక్తి, దివ్యచేతన ఒక జలపాతంలా భూమిపై ఉరకలు వేస్తూ దుమికాయి.

మూలం: శ్రీమాత (CWM Vol. 15, p. 188)

యదార్థమైన క్రొత్త పరిణామం ఏమిటంటే ఒక నూతన ప్రపంచం ఆవిర్భవించింది, జనియించింది, ఉదయించింది. అది తనంతట తాను పరివర్తన చెందిన పాత ప్రపంచం కాదు. క్రొంగొత్త జన్మనెత్తిన వినూత్న ప్రపంచం. ఈ రెండు ప్రపంచాలు ఒకదానితో నొకటి ముడిపడి ఉన్న అవస్థాంతర దశలో మనమున్నాము. ఆ దశలో పాత ప్రపంచం అత్యంత శక్తియుతమై సామాన్య చేతనను పూర్తిగ వశపరచుకొని కొనసాగుతుంటే, నూతన ప్రపంచం చడిచప్పుడు గాకుండ, వినమ్రతంగా, పరోక్షంగా, ప్రస్తుతానికి బహిరంగంగా దేనినీ అతిగా అలజడికి లోను చేయకుండా, ఎక్కువగా ఎరుకలోకి రాకుండా, నెమ్మదిగా చేరుకుంటున్నది. అయినప్పటికి, అది తనకై తాను తన అధికారతను ప్రస్ఫుటంగా నిరూపించుకొనే స్థోమత పుంజుకొనే వరకు, క్రియాశీలమై వృద్ధి చెందుతూనే ఉంటుంది.

మూలం: శ్రీమాత (CWM Vol. 9, p. 150)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మన ప్రగాఢమైన ఆకాంక్ష — అంతిమ గమ్యం

స్వర్ణోజ్వల కాంతి ప్రసరణం

(జ్ఞానస్వరూపం దీపం, భగవంతుని స్వరూపమే జ్ఞానం, అది తెలియకపోవటమే అజ్ఞానం, అదే సకల వ్యత్యాసాలకు, అనర్థాలకు మూలం. ఆ మూలాన్ని సమూలంగా రూపుమాపాలంటే జ్ఞానాన్ని పొందాలి. జ్ఞానతేజస్సును ధరించాలి, భరించాలి, అప్పుడు అనంత తేజోవలయమౌతుంది విశ్వం, అచట అప్పుడు అంధకారానికి ఆనవాళ్లైనా దొరకవు, ఏకత్వం పరిఢవిల్లుతుంది, అమరత్వం సిద్ధిస్తుంది. మొసలి బారిన పడిన గజేంద్రుడు తనను రక్షించమని మొరపెట్టుకుంటూ,

"లోకంబులు లోకేశులు
లోకస్థులు దెగిన తుదిన లోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగు నతనినే సేవింతున్."

అంటూ తన మనసులో చిత్రించుకొన్న సర్వేశ్వర రూపం సాక్షాత్కరిస్తుంది. తాను పొందిన ఆ తేజో సాక్షాత్కారాన్ని శ్రీఅరవిందులవారు అందరికీ అందించటానికి ఆ అనిర్వచనీయానుభూతిని *The Golden Light* అన్న భావగీతం *(sonnet)* లో అక్షరబద్ధం చేశారు. *8-8-1938* మరియు *22-3-1944* తేదీలలో ఆ గీతానువాదమిది.)

మీ సువర్ణ తేజస్సు నా మేధోవలయంలో ప్రవేశించింది
ఆ కాంతి పరిష్వంగంలో నా మనోకుహరంలోని వెలసిపోయిన గదులు
జ్ఞానతేజోలంకృత అతీంద్రియోపరితలానికి దీటుగ విరిసినవి,
ఓ ప్రశాంత ఓజస్తేజో అలంకరణం, ఓ ఓంకార జ్వాలా

నా శిరస్సు నుండి స్వరపేటికపై జాలువారింది మీ సువర్ణ తేజస్సు,
నా వాక్కంతా ఇప్పుడు వేదపదబంధ స్వర కల్పన
ఆ నిశ్చల చింతన, నా ఏకైన స్వరమా! నీ స్తోత్రమాలిక;
నా మాటలు సురాపానమత్తచిత్తములు, దైవోన్మత్తములు.

మీ అమృతత్వంలో నా మనుగడను మర్దించి
మీ స్వర్ణకాంతి స్రవంతులు నా హృదయంలో సంగమించాయి.
ఇప్పుడు నా దేహం ఓ దేవాలయంగ ఎదిగింది, మీ ఆవాసంగ మారింది
దాని భావోద్వేగములన్నీ ఏకాగ్రతతో మీ వైపే మరలి ఉన్నవి.

ఇప్పుడు మీ స్వర్ణకాంతులు నా పాదాలచెంత పారాడుచున్నవి.
నేనున్న ధరిత్రి ఇప్పుడు మీ ఖేలావని, మీ పీఠం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(శ్రీఅన్నవరం ఆదిశేషయ్య గారి "ఆహ్వానం" రచనల నుండి సేకరించబడినది)

శక్తుల పరస్పర సంఘర్షణ — పరిష్కారము

ఒక్క విషయము స్పష్టంగా కనిపిస్తోంది. అది మానవజాతి ఒక ఒత్తిడికి గురైందన్న సత్యం. ఈ ఒత్తిడి మనం చేస్తున్న కృషిలో, కార్యాచరణలో, చివరికి నిత్యజీవితంలో అంతటా వ్యాపించింది. విస్తృతమై, మితిమీరిన కార్యాచరణ యొక్క ఫలితం అంతటా ఒక అలజడిని కలగచేస్తోంది. చివరికి అది ఏ పరిస్థితికి దిగజారిందంటే, అది ఈ మొండివైఖరిని ఛేదించుకుని కొత్తచైతన్యం పొందాలి, లేదా అంధకారం, తమస్సులోకి పతనం చెందాలి.

ఈ ఒత్తిడి ఎంత సంపూర్ణంగా ఉండి, ఎంతగా సర్వత్రా వ్యాపించిందంటె — ఇప్పుడు ఏదో విధంగా ఆ పద్ధతిని అడ్డుకోవాలి, విచ్ఛిన్నం చేయాలి. ఇంక ఈ విధంగా సాగడం కుదరదు. ఇది పదార్థంలోకి ఒక నూతన శక్తి చైతన్యం చేరిందనడానికి ఒక స్పష్టమైన గుర్తుగా భావించవచ్చు. ఆ ఒత్తిడే ఈ తీవ్రస్థితికి కారణం. బాహ్యంగా ఒక మార్పు తీసుకురావాలన్నపుడు ప్రకృతి తన పాతపద్ధతులను ఉపయోగిస్తుందని మనం అనుకోవచ్చు. అయితే ఒక నూతన విలక్షణత కూడా ఉంది. కాని అది 'ఉన్నతస్థాయి' కి చేరినవాళ్లలో మాత్రమే చూడగలం. అయితే ఆ 'ఉన్నతస్థాయి' కూడా అంతటా వ్యాపించింది. అది ఒకే స్థాయిలో కేంద్రీకృతమవలేదు. ప్రపంచంలోని

ఒకే ప్రదేశంలో మాత్రమే లేదు. దాని తాలూకు జాడలు అన్ని దేశాల్లోనూ ఉన్నాయి, ప్రపంచమంతటా ఉన్నాయి. అదే ఓ నూతన, ఉన్నత, ప్రగతిశీలమైన పరిష్కారాన్ని కనుక్కొందుకు సంకల్పించడం. మరింత సర్వతోముఖమైన, విస్తృతమైన పరిపూర్ణత్వం కోసం కృషి చేయడం.

కొన్ని ఆలోచనలు మరింత సామాన్య స్వభావానికి సంబంధించినవి, మరింత విస్తృతి కల్గినవి, మరింత 'సామూహిక' స్థాయికి చెందినవి. ఈ ప్రపంచంలో ప్రయోగాత్మకంగా పనిచేస్తున్నాయి. ఈ రెండు జతగానె ప్రయాణిస్తాయి. ఒకటి మరింత ఘోరమైన వినాశనం, నిర్లక్ష్య వైఖరితో కూడిన నూతన అన్వేషణ ద్వారా దుర్ఘటనలు పెరగడానికి దోహదం చేయడం. అది కూడా ఇంతకు ముందెప్పుడూ సంభవించనంత పెద్ద ఎత్తున జరగడం. అదే సమయంలో మరింత ఉన్నతమైన, సర్వతోముఖమైన సంకల్పంతో కూడిన ఆలోచనలు, కార్యాచరణయొక్క పుట్టుక, అభివ్యక్తి — వీటిని గ్రహించగలిగితే, అవి మరింత విశాలమైన, సమగ్రమైన నివారణోపాయం అందిస్తాయి.

ఈ బాధామయ, సంఘర్షణాత్మక పరిణామ ఆరోహణాక్రమంలోని సమగ్ర దివ్య సాక్షాత్కారానికి సహకరించె నిర్మాణాత్మక శక్తులకి, మరింత వినాశనానికి దారితీసే శక్తివంతమైన శక్తులకి మధ్యనున్న ఈ సంఘర్షణ మరింత స్పష్టంగా కనపడుతుంది. ఆ రెండు విధ్వంస, ఉన్నత శక్తుల మధ్య ప్రచ్ఛన్నమైన పోరాటం జరుగుతూనె ఉంటుంది. లక్ష్యాన్ని చేరడానికి ఈ రెంటి మధ్య పోటీ స్పష్టంగా కనపడుతుంది.

దైవప్రతికూల శక్తులు, దుష్టశక్తులు, ప్రాణిక ప్రపంచశక్తులు, ఈ భూమిపైకి దిగి, ఈ భూమిని వాటి కార్యాచరణ కేంద్రంగా చేసుకున్నాయి. అదే సమయంలో నూతన ఉన్నతశక్తులు, మరింత ప్రబలమైన ఆధ్యాత్మిక శక్తులు ఈ పృథ్వి పైకి అవరోహించి నూతన జీవన సృష్టికి ప్రయత్నిస్తున్నాయి. ఈ రెండింటి వల్ల ఈ ఘర్షణ మరింత తీవ్రంగా, మరింత ఉద్రిక్తంగా, మరింత ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది.

ఈ ద్వి శక్తుల మధ్య సాగే ఈ సంఘర్షణ వల్లే మనం ఒక శీఘ్రపరిష్కారాన్ని ఆశించవచ్చు.

*

...ఈ ప్రపంచచరిత్ర ఒక మలుపు తిరిగింది, ఓ మార్పు జరిగింది. అది మనలో ఒక ఆశను చిగురింపచేస్తోంది. ఈ మానవులలో కొందరు ప్రత్యేకమైన వ్యక్తులు, బహుశ అతి కొద్ది సంఖ్యలో స్వచ్ఛమైన బంగారంగా మారేందుకు సిద్ధంగా ఉన్నారు.

వారు హింసాత్మకంకాని దృఢశక్తిని, వినాశనం చేయని నాయకత్వ లక్షణాలని, ప్రమాదాలులేని సాహసాన్ని అభివ్యక్తం చేస్తారు.

...వారి గురించి శ్రీఅరవిందుల సమాధానం "మానవుడు ఆధ్యాత్మికంగా మారడానికి అంగీకరిస్తే, వ్యక్తి తాను ఆధ్యాత్మికతను అంగీకరిస్తే... అంగీకరిస్తే".

ఆంతర్యంలో ఏదో ఈ ఆధ్యాత్మికతను ప్రేరేపించి, ఆకాంక్షిస్తుంది. మిగిలిన దంతా తిరస్కరిస్తుంది. స్వభావం మామూలుగా ఉండడానికే ఇష్టపడుతుంది. మార్పును కోరదు. అది ఒక లోహమిశ్రమంలా ఉంటుంది. దాన్ని కొలిమిలో కాల్చి, నిఖార్సయిన ఆకృతి నివ్వాలి.

పృథ్వి చరిత్రలో మనం మళ్ళీ ఒక నిర్ణయాత్మకమైన మలుపు దగ్గర ఉన్నాం. అన్ని వైపుల నించి ఉత్కంఠతతో ఎదురుచూస్తూ ప్రశ్నిస్తున్నారు. ప్రతి చోట తీవ్రతాపం, సంభావన, భయం... ఏది జరగబోతోందన్న ప్రశ్న?... అయితే వీటన్నింటికి ఒకే సమాధానం "మానవుడు ఆధ్యాత్మికంగా మార్పుచెందడానికి అంగీకరిస్తే".

స్వచ్ఛమైన బంగారంగా మారిన ఆ కొద్దిమంది వ్యక్తులు — ఈ ప్రస్తుత పరిస్థితిని మార్చడానికి చాలు — ఇప్పుడు మనకది తీవ్ర ఆవశ్యకత.

మన నుంచి దైవం కోరుతున్న ఈ ధైర్యం, సాహసాలను మనం స్వయంగా మన కష్టాలను ఎదుర్కొనేందుకు వాటిని ఎందుకు ఉపయోగించకూడదు? మనం మన అసంపూర్ణత్వాలని, అస్పష్టతలను ధైర్యంగా యోధునివలె అంతరంగ కొలిమిలో శుద్ధిచేసి, మళ్ళీ మళ్ళీ మొత్తం నాగరికతను అంధకారంలో ముంచెత్తే వినాశకరమైన దుస్సహమైన దారిలోంచి పూర్తిగా బయటపడవచ్చు.

ఇదే మన ముందున్న సమస్య. దీనిని ఎవరికి వారు వారికి అనువైన మార్గంలో పరిష్కరించుకోవాలి.

ఈ సాయంత్రం మీరు నన్నడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్తున్నాను. నా సమాధానం శ్రీఅరవిందు లిచ్చిన సమాధానమే. "ఒక్కసారి మనిషి తాను ఆధ్యాత్మికంగా మారడానికి అంగీకరిస్తే..."

నేను దానికి మరో మాట జత కలుపుతాను: మానవ దృక్పథంలోంచి చూసినపుడు — కాలం మనల్ని తొందరపెడుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ప్రస్తుత ప్రపంచం — దివ్యచైతన్య ప్రపంచం

ఒక అతిముఖ్యమైన తేడా:

ఒక్క విషయం నేను నొక్కిచెప్పవలసినది. ఈ క్షణంలో నాకు అనిపించినది, మన ప్రస్తుత ప్రపంచానికి, రాబోయే దివ్యచైతన్య ప్రపంచానికి మధ్యగల అతిముఖ్యమైన తేడా. ఇక్కడి ప్రతి విషయం, ఆంతర్యపు లోతుల్లో జరిగేది మినహా, అంతా కృత్రిమమే. ఆ దివ్యచైతన్య ప్రపంచంలోకి ఇక్కడ సర్వసాధారణంగా పనిచేసే చేతనా స్ఫూర్తితో పూర్తి ఎరుక కలిగి ప్రవేశించినప్పుడు, అది ఎంత మితిమీరిన కాపట్యమో ప్రస్ఫుటమైంది. సాధారణ భౌతికజీవితంలో ఏ ఒక్క విలువ కూడా సత్యాన్ని ఆధారంగా చేసుకున్నది కాదు. మనం దుస్తులు ధరించడానికని ఏదో కొంత బట్ట సంపాదించి దుస్తులు తయారుచేసుకుని కోరుకున్నప్పుడు ధరించినట్టే, శరీరపోషణకి ఏవో కొన్ని పదార్థాలు సంపాదించి, వండుకుని తినాలి. ఇలా ప్రతి విషయంలోను మన జీవితం కృత్రిమమే.

ఒక సత్యమైన, చిత్తశుద్ధితో కూడిన, నవనవోన్మేషమైన దివ్యచైతన్య ప్రపంచ జీవితం ఎలాగుంటుందంటే, చైతన్య సంకల్పం వల్ల అప్పటికప్పుడు వస్తువులను సృజించగలిగి, పదార్థాన్ని మన నిర్ణయాలకు అనుగుణంగా మార్చగల శక్తి కలిగి వుంటుంది. ఏ మనిషికీ జ్ఞానం, శక్తి ఉంటాయో, అతడు కోరుకున్నవాటిని పొందగలడు. ఎవరికైతే ఆ జ్ఞానం, శక్తి లేవో, వారికి వారు కోరుకున్నది పొందటానికి కృత్రిమ పద్ధతులుండవు.

సాధారణ జీవితంలో ప్రతీదీ కృత్రిమమే. పుట్టుకతో, లేక పరిస్థితులను బట్టి నువ్వొక వున్నత స్థానంలోనో, అధమస్థానంలోనో లేదా ఎక్కువ లేక తక్కువ సుఖ జీవితంలోనో వుండవచ్చు. కాని అది జీవియొక్క సహజసిద్ధమైన సమయస్ఫూర్తి వల్లగాని, ఆంతర్యంలో వుండే కోరికవల్లగాని వచ్చింది కాదు. జీవితంలో సంభవించే పరిస్థితులు, అవకాశంతో నీకు ఈ విషయాలతో సంబంధం ఏర్పడింది. బొత్తిగా ఎందుకూ కొరగానివాడు అందలం యెక్కొచ్చు. సృజనాత్మకతలో, కార్యనిర్వహణలో అద్భుతమైన శక్తిసామర్థ్యా లున్నావాడు అధమస్థానంలో వుండవచ్చు. ప్రపంచమే నిజాయితీ కలిగినదైనప్పుడు సమర్థత కలిగినవాడు తనకు తగిన ప్రయోజనకరమైన స్థానంలోనే వుంటాడు.

ఈ కృత్రిమత్వం, కాపట్యం, ఈ సత్యరాహిత్యం నన్ను నిశ్చేష్టురాలిని చేస్తున్నవి. ఇంత తప్పుడు పద్ధతిలో నున్న ప్రపంచంలో, మనకు యదార్థమైన విలువలు ఎలా సమకూరుతాయి? అని ఆశ్చర్యం కలుగుతుంది.

అధిమానస ప్రపంచం

శ్రీఅరవిందుల కృషి ఒక నిరుపమాన భూపరిణామం కోసం. మనిషి మనస్సు యొక్క ఊర్ధ్వస్థాయిలో ఎన్నో చైతన్యస్థాయిలున్నాయి. వాటిలో నిజమైన దివ్య ప్రపంచం యేదైతే వుందో దానినే శ్రీఅరవిందులు దివ్యచైతన్యం అన్నారు. అదే సత్యప్రపంచం. కాని మనస్సుకి, దివ్యచైతన్యానికి మధ్య అధిమానసమనేది ఒకటున్నదని ఆయన కనుగొన్నారు. ఈ అధిమానసమే విశ్వదైవాల ప్రపంచం. ఈ అధిమానసమే ఇప్పటివరకు ప్రపంచాన్ని పరిపాలిస్తున్నది. తేజోవంతమైన ప్రదీప్తమానస చైతన్యస్థాయిలో మనిషి అందుకోగలిగిన అత్యున్నతమైన స్థాయి ఇది. ఇదే సర్వోన్నత దివ్యత్వంగా తీసుకోబడడమే కాకుండా, అక్కడి వరకు చేరినవారెవ్వరూ తాము నిజమైన పరమాత్మను చేరుకున్నామని ఇసుమంతైనా సందేహించ లేదు. దీని అద్భుతాలు ఎంత ఘనమైనవంటే, సాధారణ మానవచైతన్యం దీనినే అత్యున్నత అంతిమ వాస్తవంగా నమ్మగలిగింది. అయినప్పటికీ యదార్థానికి నిజమైన దివ్యత్వం కంటే యీ అధిమానసం చాలా నిమ్నస్థాయిలో వున్నది. అది సత్యానికి అధికారిక స్థానం కాదు. అదొక కాల్పనిక స్థానం. చరిత్ర ప్రారంభం నించి మానవుడు సాగిల పడుతున్న ఏ దేవుళ్ళు, సృజనాత్మకశక్తులు వున్నవో వాటి రాజ్యమే అది. నిజమైన దివ్యత్వం అభివ్యక్తం కాకపోవడానికి, పరిణామం చెందకపోవడానికి కారణం ఈ అధిమానసమే దివ్యచైతన్యంగా పొరబడడం చేతనే. విశ్వదైవాలు సంపూర్ణంగా సత్యచైతన్యంలో జీవించరు. అవి కేవలం ఆ చైతన్యాన్ని స్పృశిస్తాయి. దానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. అంతే! వాటిలో ప్రతి ఒక్కటి వాటి వాటి విజయాలకి సంబంధించిన విషయం.

అతిమానసం కూడా చరిత్రలో పనిచేస్తున్నదనడానికి సందేహమే లేదు. కాని అది నిరంతరం అధిమానసం ద్వారానే పనిచేస్తుంది. దివ్యచైతన్య అవరోహణ నేరుగా జరిగినప్పుడు, ఆ చైతన్యశక్తి మాత్రమే జీవితాన్ని దైవపరంగా పునరుజ్జీవింప చేయగలదు. ఏ నిమ్న త్రివిధ ప్రపంచంలో మానవుని ఉనికి వున్నదో దాని ప్రారంభాలను

గుర్తించే అధిమానసం అప్పటికే సిద్ధంగా పనిచేస్తున్న సాధ్యతల లీల. త్రివిధ ప్రపంచం అన్నది మనస్సు, జీవితం మరియు పదార్థం. ఎప్పుడైతే అక్కడ ఈ లీల ఉండి, అప్పటికప్పుడు తనంతట తాను పుట్టిన ఆధ్యాత్మిక అంతస్సత్యం యొక్క దోషరహిత కార్యాచరణ కానిది లేదో, అక్కడే అజ్ఞానం యొక్క బీజం వుంటుంది. అలాగని అధిమానసం అజ్ఞానస్థానమని చెప్పలేము. కాని అది ఉన్నత, నిమ్నస్థాయిల సరిహద్దు రేఖ. ఈ సాధ్యతల, వేర్పాటు ధోరణుల లీల సముచితమైన విభజన కానప్పటికీ అది విషయాల యదార్థత నుండి తప్పించడానికి దారితీయవచ్చు.

కనుక, అధిమానసం మానవత్వాన్ని, దివ్యత్వంగా పరిణామం చెందించే శక్తిని కలిగినది కాదు, కాలేదు. దానికి దివ్యచైతన్య మొక్కటే పూర్తిగా ప్రభావవంతంగా పనిచేయగలిగే ప్రతినిధి. ఏది సరిగ్గా మన యోగాన్ని గడిచిన కాలంలో జీవితాన్ని ఆధ్యాత్మికం చేయడానికి చేసిన ప్రయత్నాల నుండి వేరుచేశాయో అవి మనకు తెలుసు. అవేమిటంటే అధిమానసం యొక్క అద్భుతాలు. అంతే కాని అత్యున్నత యదార్థత కాదు. మనస్సుకి, దివ్యసత్యానికి మధ్య నుండే ఒక మెట్టు మాత్రమే.

1. అశాశ్వతమైన శరీరం పుట్టుక వైభవంగా జరుపుకోవడం వలన కొన్ని నమ్మకాల అనుభూతులను సంతృప్తి పరచడమౌతుంది.
2. శాశ్వత చైతన్యం యొక్క అభివ్యక్తిని వైభవంగా జరుపుకోవడం, ప్రపంచ చరిత్రలో ప్రతి క్షణం జరుపుకోవచ్చు.

కాని, ఒక నూతన ప్రపంచం యొక్క ఆవిష్కరణ, దివ్య చైతన్య ప్రపంచ అవతరణను, వైభవంగా, వేడుకగా జరుపుకోవడం ఒక అద్భుతమైన, అపూర్వమైన సదవకాశం.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

నూతన చైతన్యం అందుకోవటానికి మనం ఏ విధంగా సంసిద్ధులమవగలం

నూతన చైతన్యం అందుకోవటానికై మనం సంసిద్ధులమవటానికి మొట్టమొదటి నిబంధన నిజమైన, సహజసిద్ధమైన వినమ్రత; అది మనలను మనకేమీ తెలియదనీ, మనం అందుకోబోయే అద్భుత విషయాలపరంగా చూస్తే మనలో ఏమీ లేదనే గాఢమైన అనుభూతిని పొందేటట్లు చేస్తుంది.

*

ప్రశ్న: గడచిన సంవత్సరం అవతరించిన నూతన చైతన్యం స్వేచ్ఛగా పనిచేయ డానికి సాధకులేం చేయాలి?

1. గ్రహించడానికి సన్నద్ధులై ఉండడం.
2. కోమలత్వాన్ని కలిగి ఉండడం.

*

ప్రశ్న: శ్రీఅరవిందులు సం. 1919 లో అప్పటి గందరగోళాలు, దుర్ఘటనలు బహుశా నూతన సృష్టి ప్రసవవేదన అయి ఉండవచ్చని వ్రాశారు. ఆశ్రమంలోనూ, భారతదేశంలోనూ, చివరికి ప్రపంచంలోనూ ఇది ఎంతకాలం కొనసాగుతుంది?

అది ప్రపంచం తయారయి, స్వీకరణకు ఆమోదం తెలిపేదాకా కొనసాగుతుంది. ఈ నూతన సృష్టి చైతన్యం ఇప్పటికే ఈ సంవత్సంర ఆరంభం నుంచే భూమి మీద తన పని కొనసాగిస్తున్నది. జనులు దానిని అడ్డుకోకుండా ఉండి, దాని పనిలో సహకరిస్తే అది చాలా వేగవంతమౌతుంది. కాని మూర్ఖత, అజ్ఞానం అనేవి చాలా పెడసరమైనవి, మొండి పట్టుదల గలవి!

*

ప్ర: శ్రీమాతా, 'ప్రపంచం గొప్ప మార్పుకు సిద్ధమౌతున్నది, నీవు సహాయపడ తావా' అని మీరు చెప్పే ఆ గొప్ప మార్పు ఏమిటి? మేము దానికి ఏ విధంగా సహాయపడగలం?

ఈ గొప్ప మార్పు భూమి మీద నూతనజాతి ఆవిర్భావాన్ని తెలియజేస్తుంది, జంతువుకి మనిషి ఏలాగో, మనిషికి అది అలాగు. ఈ నూతన జాతి చైతన్యమును ఎవరైతే గ్రహించగలిగి, శ్రద్ధాళువులై ఉన్నారో వారిని జ్ఞానప్రకాశంతో ఉత్తేజితులను

చేయడానికి ఈ నూతనజాతి చైతన్యం ఇప్పటికే ఈ భూమి మీద పనిచేస్తున్నది.

*

ప్రశ్న: మీరు మమ్ములను మీకు సహాయం చేయమన్నారు. నేను ఏ విధంగా సహాయం చేయగలను? నేనేం చేయాలి?

ఏకాగ్రత వహించి, ఉన్మీలనంతో నూతన పురోగమన చైతన్యాన్ని స్వీకరించడం, క్రిందకు దిగివచ్చే నూతన విషయాలను గ్రహించడం.

*

మార్పు రావడానికి మన సహాయం అవసరం లేదు. కాని మనం ఆ చైతన్యానికి ఉన్మీలమవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే దాని రాక మనకు వ్యర్థం అవకూడదు.

*

దాని కార్యసరళి చాలా సున్నితంగా ఉంటుంది. ఎందువల్లనంటే బహుశా అది పరిచితమైనది కాదు కాబట్టి — దాని అతిచిన్న కదలికా, అతిస్వల్ప మానసిక స్పందనా అంతటినీ కలవరానికి గురిచేస్తుంది. కాని అది ఎంతకాలం ఉంటుందో అంతమటుకు పరిపూర్ణంగా పరిశుద్ధమైనది. తప్పనిసరిగా అదే అతిమానస జీవితపు నిరంతర స్థితి. మానసికమైన ఆధ్యాత్మిక ఇచ్ఛ ఏమాత్రం కల్పించుకోకూడదు; ఎందువల్లనంటే ఒకరు ఆధ్యాత్మిక ఇచ్ఛను కలిగి ఉండి, ఆధ్యాత్మిక ఇచ్ఛనే వ్యక్తం చేస్తూ నిరంతరం జీవిస్తూ ఉండవచ్చు. అది అంతరంగంలోని దైవం మార్గదర్శనం చేస్తున్నాడనే అనుభూతిని పొందేవారందరి విషయంలో జరుగుతుంది — కాని అది ఒక మానసిక పరివర్తన ద్వారా కలుగుతుంది. అది ఆ విధంగా ఉన్నంతకాలం, అది అతిమానసిక జీవితం కాదు. అతిమానసిక జీవితం మనస్సులో నుంచి ఎంతమాత్రం ప్రసరించదు. మనస్సు దానికి ఎటువంటి కదలికాలేని ప్రసారవాహికా క్షేత్రం. చిన్న కుదుపు చాలు, దానిని కలవరపరచటానికి.

*

నూతన అస్తిత్వజీవి రావటానికి మన సంపూర్ణ శక్తియుక్తుల తోటి ప్రయత్నం చేద్దాం. మనస్సును తప్పక నిశ్శబ్దపరచాలి, దాని స్థానంలో సత్యచైతన్యాన్ని ప్రతిష్ఠించాలి — సమస్తమునూ సామరస్యపరుస్తూ, అతిసూక్ష్మ వివరముల చైతన్యమునూ కలిగినటువంటి ఒక చైతన్యం ప్రతిష్ఠించాలి.

*

ప్రశ్న: 'భవిష్యత్తు కోసం పని చేయాలి' అంటే ఏమిటి?

దాని ఆరంభం, వ్యక్తిగతమైన, దేశగతమైన పాత అలవాట్లను అంటిపెట్టుకోకుండా ఉండడంతో మొదలవుతుంది.

*

సత్యమే నీకు ప్రభువు, నీకు మార్గదర్శి అగు గాక. మనం మన అస్తిత్వంలో, మన కర్మలలో దివ్యసత్యం కోసం, దాని విజయం కోసం ఆకాంక్షిద్దాం.

దివ్యసత్యం కోసం చేసే ఆకాంక్ష, మన ప్రయత్నాలకు క్రియాశీలమగు గాక.

ఓ దివ్యసత్యమా! నీ మార్గదర్శనాన్ని మేము కోరుతున్నాం. భూమి మీద నీ సార్వభౌమ పరిపాలన వచ్చును గాక.

*

నిజం చెప్పాలంటే, ప్రతి వ్యక్తీ అల్పమే, అల్పమే, అల్పమే. ఎంత అల్పమంటే, అతడిలో అతిమానసం ఉంచటానికి కావలసినంత చోటు లేదు. అది ఎంత స్వల్పమంటే అది అప్పటికే సర్వసాధారణమైన, అప్రధానమైన, హీనమైన మానవగమనాలతో పూర్తిగా నిండిపోయింది. అతిమానస గమనాలకు చోటు కల్పించాలంటే దానిని తప్పకుండా బృహత్తరంగా విస్తృతపరచవలసి ఉంది.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

(CWM !5:106-08; !0:115; 15:108, 181: !2:13)

ఇహలోకంలో మనో ప్రాణ శరీరాలు తన్ను తాను తెలుసుకొనుటకు, ఆత్మసాఫల్యం పొందడానికి ప్రయత్నిస్తూ, అభివృద్ధి చెందుతున్న ఆత్మయే — మానవుడు.

శ్రీఅరవిందులు

నూతన సృష్టి ప్రభావంలో మానవజాతి — శ్రీమాత భవిష్యదర్శనం

నవ్యమూ లేక అతిమానస సృష్టి కనుగుణంగానూ మానవజాతి స్థితిగతులనూ, మావనజాతిలో ఉండే వివిధ శ్రేణులనూ వాస్తవికంగా, సజీవదృశ్యంగా చూపిస్తూ, శ్రీఅరవిందులు నన్ను సుమారు ఒక గంటకు మించి దానిలోనే జీవించేటట్లుగా చేశారు. అది చాలా అద్భుతంగా సుస్పష్టమై, యదార్థమై, సజీవమై ఉన్నది....

ఆ దృశ్యం అతిమనోహరమై ఎంతో గంభీరంగా, ఎంతో ప్రశాంతంగా, ఎంతో విలాసంగా ఉంది. ఓహ్, అది పూర్తిగా, నిజంగా సంపూర్తిగా దివ్యప్రేమతో నిండి ఉంది. కాని అది 'క్షమించే' దివ్యప్రేమ మాత్రం కాదు — అది అటువంటిది ఎంత మాత్రమూ కాదు, ఏమాత్రమూ కాదు! ప్రతిదీ దాని స్థానంలో సుప్రతిష్ఠితమై ఉండి, తన అంతరంగలయతో ఎంత సమగ్రంగా ఉంచుకోగలదో, అంతగా సాక్షాత్కరించుకుంటూ ఉన్నది.

అది ఎంతో అందమైన బహుమతి. జనులు వీటన్నింటి మీద, మేధోపరంగా భావసారూప్యంతో, కొంతవరకు, ఒక అభిప్రాయం ఏర్పరుచుకుని ఉన్నారు. అదంతా వారికి తెలుసు. కాని అదంతా పూర్తిగా నిరుపయోగం. కొంత వాస్తవమైన అవగాహనతో దైనందిన జీవనంలో, నీవు మరొక రకంగా జీవించటం జరగవచ్చు. కాని అక్కడ, వాటిని స్పృశిస్తున్నామనేటటువంటి అనుభూతి — వాటి ఉన్నతమైన ప్రక్రియా విధానంలో వాటిని చూడటం జరిగింది, వాటిని స్పృశించటం జరిగింది. అదే భావన.

మొదట అది మొక్కలను, ముఖ్యంగా సహజసిద్ధమైన అందంతో అలరారే మొక్కలను (అది ఒక విధంగా చాలా అద్భుతం) చూసిన తరువాత వచ్చిన దృశ్యం. తరువాతి దృశ్యంలో అక్కడ ఉన్నవన్నీ జంతువులు, అవి ఎంతో సమరస పూరితమైన జీవితాలని గడుపుతున్నాయి (మనుషులు కల్పించుకోనంతవరకు). అదంతా కూడా ఉండవలసిన సరైన స్థితిలో ఉన్నది; దాని తరువాత మానవజాతి లాంటి నిజమైన మానవజాతి; దానిని విడమరచి చెప్పాలంటే, ప్రశాంత మనస్సు ఎంతమటుకు సౌందర్యాన్ని, సామరస్యాన్ని, ఆహ్లాదాన్ని, శోభాయమానమైన జీవితాన్ని, జీవన సర్వస్వాన్ని సృజించగలదో అటువంటి మానవజాతి అది — సౌందర్యంలో జీవనస్వారస్యం, అది ఎటువంటిదంటే సహజంగా వికృతమైన దానిని,

హీనమైనదానిని, నీచమైనదాని నంతటిని బహిర్గతం కానీయకుండా శమించివేయడం. అది ఒక మేలైన మానవజాతి. మానవజాతి దాని అత్యున్నతస్థితిలో ఉండే విధానం, అయినా, అతినాజూకై ఆకర్షణీయమైనది. మానవజాతికి పరిపూర్ణంగా సంతృప్తికరమైన పరిష్కారం, ఎందువల్లనంటే అది పూర్తి సామరస్యత కలిగిన జీవనం. బహుశా అది, ముందు ముందు చాలా మటుకు మానవజాతి అంతా ఆ నూతనసృష్టి ప్రభావంలో నూతనత్వాన్ని సంతరించుకుంటుందని చేసే వాగ్దానం లాంటిది. నేను చూసినదానిని బట్టి అతిమానసచైతన్యం మానవజాతిని ఆ విధంగా తయారుచేయబోతున్నదనే విషయం అవగతమైంది. మానవజాతి ఏ విధంగా జంతుజాలం నుంచి వచ్చిందనేది సైతం అక్కడ పోల్చి చూపడం జరిగింది. అది అధికశాతం కలగాపులగంగా కలిసిపోయి ఉన్నది, అది సహజమే. కాని అన్నీ సమగ్రపరచబడి, శ్రేష్ఠత నొందించబడి, ఇంకా ఎక్కువ సంపూర్ణంగా వినియోగించబడుతున్నాయి. మానసిక ప్రభావంతో జంతు స్వభావం మరొక విధంగా తయారయింది. సహజంగానే అది ఒక కలగాపులగ మిశ్రమం, ఎందువల్లనంటే మనస్సు అసంపూర్ణమైనది కాబట్టి. అదే విధంగా సమత్వం కలిగి స్థిరబుద్ధికల మనుషులలో సామరస్యతాపూర్వక మానవజాతి ఉన్నటువంటి ఉదాహరణలూ ఉన్నాయి. ఇదే పద్ధతిలో అతిమానస ప్రభావంతో మానవజాతి తయారుకాగలదని అనిపిస్తున్నది.

కానీ అది ఎంతో దూరాన చాలా కాలం తర్వాత జరిగే విషయం. ఇది వెంటనే జరిగిపోతుందని మీరు అనుకోవద్దు — అది చాలా కాలం తరువాతనే జరుగుతుంది.

ఇప్పటికీ అది సుస్పష్టం. ఈ మార్పు జరిగే సంధికాలపు సమయాభావం చాలా ఎక్కువ. అది ఒక రకంగా బాధాకరమైనది. దాని కోసం చేసే ప్రయత్నం అప్పుడప్పుడు బాధాకరమైనదైనా (తరచు బాధాకరమైనది), సుస్పష్టమై అందుకోవలసిన లక్ష్యదృష్టితో, ముమ్ముందు కచ్చితంగా అందుకునే లక్ష్యమే ఆ బాధకు పరిహారం. అది జరిగి తీరుతుందనే హామీ, అవును కచ్చితంగా జరిగి తీరుతుంది. కానీ అదంతా మనోజీవనపు తప్పు లన్నింటినీ, అపభ్రంశాలన్నింటినీ, వికృతాలన్నింటినీ లేకుండా చేసే శక్తి కలిగినటువంటిది — అది జరిగిన తరువాత మానవజాతి ఎంతో సంతోషంతోనూ, మానవులుగా ఉన్నందుకు ఎంతో సంతృప్తితోనూ ఉంటారు, అంతే కానీ, మానవుల కంటే వేరుగా ఉండవలసిన అవసరాన్ని కలిగించే అనుభూతి అనేదేమీ లేకుండా, మానవ సొబగును, మానవ సామరస్యాన్ని కలిగి ఉంటారు.

అది ఎంతో ఆహ్లాదభరితంగా ఉంది, నేను అందులో నివసించినట్లే ఉంది. వైరుధ్యాలన్నీ మాయమైపోయినై. ఆ పరిపూర్ణతలో నేను వసించినట్లే ఉన్నది. మానవజాతికి సంబంధించినంత మటుకు అది ఎంత మటుకు పరిపూర్ణత నొందగలదో దానిని అతిమానస చైతన్యపు ఆదర్శానికి అనుగుణంగా వెల్లడించినట్లే ఉన్నది. అది ఎంతో బాగుంది. ఇది నాకు గొప్ప ప్రశాంతతో కూడిన స్థైర్యాన్నిచ్చింది. ఒత్తిడి, ఘర్షణ అంతా మాయమైపోయింది, దానికి తోడైన అసహనమూను. అదంతా పూర్తిగా అదృశ్యమై పోయింది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

(CWM !1:24-27)

అమ్మ: భగవంతుని దివ్యచేతన, దివ్యశక్తి

ప్రశ్న: సృష్టి చేయాలని పరాత్పరుడు మిమ్మలను ఆదేశించినప్పుడు, ఏం చేయాలో మీకు ఎలా తెలిసింది?

జః నేను నేర్చుకోవాలసిందేమీ లేదు. సర్వస్వమూ ఆయనలోనే ఉంది. ప్రపంచం, ప్రపంచజ్ఞానం, ప్రపంచాన్ని సృష్టించే శక్తి. ప్రపంచం ప్రభవించాలని ఆయన నిర్ణయించగానే ప్రపంచజ్ఞానాన్ని ముందు ఆవిర్భవింపచేశాడు. తరువాత శక్తిని; అంటే, నన్ను పిలిచాడు. అప్పుడు ఈ సృష్టి చేయాలని నన్ను ఆదేశించాడు.


*

భూమి ప్రారంభం నుండి ఒక చైతన్య కిరణాన్ని అభివ్యక్తం చేయవలసి వచ్చిన దశలో, సమయంలో నేను వున్నాను.

*

శతసహస్రానేక, విశ్వవైవిధ్య ప్రాకృతిక మూలరూపాలలో కదిలే సంకల్పాన్ని నేను. కార్యరూపం దాల్చే ఆలోచన నేను. జ్ఞానసిద్ధిని పొందే శక్తిని నేను. చలనమై సాగిపోయే పదార్థాన్ని నేను.

ప్రశ్న: తల్లీ! నువ్వు మాలాగే ఎందుకు వచ్చావు? నీ నిజరూపంతో ఎందుకు రాలేదు?



*



The bird of Grace messenger from the Supreme



జః నేను మీలాగ రాకపోతే, మీకు అత్యంత సమీపానికి రాలేను. 'నాలాగా మారండి' అని మీకు చెప్పలేను కదా! అందుకు.

మీతో మాట్లాడుతున్న ఈమె భగవంతుని విశ్వాసపాత్రమైన సేవకురాలు. ఎన్నో యుగాల నుండి, భూమి పుట్టినప్పటి నుండి భగవంతుని సేవకురాలిగానే తన ప్రభువు పేరు మీదుగా ఈమె పలుకుతూ వచ్చింది. భూమి, మానవులు ఉన్నంతకాలం, శరీరం ధరించి భగవంతుని ప్రాభవం గూర్చి దివ్య ప్రబోధాలు చేస్తూనే ఉంటుంది.

శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

*

నిష్పాక్షిక సమాధానం

మహోన్నత పరాత్పర చైతన్యం అవతరించి, ఒక శరీరంలో అభివ్యక్తమైనప్పుడు,. ప్రపంచంలో ఎన్ని తిరస్కార తూష్ణీభావాలు చెలరేగినప్పటికీ, ఆ అవతార దివ్య మహత్వాన్ని నిరోధించలేవు.

అది అలా కాకపోతే, విశ్వాసం గలవారికి, ఈ విశ్వాసం ఆధారంగా నా ద్వారా పరాత్పర చైతన్యంతో సంస్పర్శ పొందడానికి సిద్ధంగా వున్నవారికి మాత్రమే నా భౌతిక శరీర అస్తిత్వం ఆసక్తి కలిగిస్తుంది.

వారికి మాత్రమే ఈ ప్రశ్న ముఖ్యమైనది. మిగిలినవారు ఆందోళన చెందనవసరం లేదు. నిజాయితీతో కార్యోన్ముఖమైన అటువంటి విశ్వాసం — వ్యతిరేకమైన, అనుకూలమైన — ప్రచారం చేయడానికి లక్ష్యంగా వుండదు. అది స్వేచ్ఛగా, సహజంగా జన్మించాలి. ఒత్తిడి ద్వారా అది రాదు. తిరస్కారంతో నశించిపోదు.

ఏ రూపంలో నున్నా, విశ్వాసంతో, గట్టి నమ్మకంతో తీవ్రస్థాయిలో పోరాడాలన్న అవసరం గూర్చి ఆలోచించే వ్యక్తి అతని అస్తిత్వంలో ఏదో చిన్న భాగం ఈ నమ్మకంతో ప్రభావితమైనదని అర్థం. మరో భాగం బాహ్యమైనది — అది చాలా ముఖ్యమైనది. విశ్వాసాన్ని అంగీకరించడానికి పూర్తిగా నిరాకరిస్తుంది. అది మరింత ప్రమాదకరమని అతనికి అనిపిస్తుంది. ఎందుకంటే అతను మరింత సున్నితంగా దానికి ప్రతిస్పందిస్తాడు. తనను తాను నమ్మింపచేసుకొనే అవసరం నుండి దానిని

బలవంతంగా తిరస్కరించే సంకల్పం దిగివస్తుంది. అంతర్ముఖంగా ఆలోచిస్తే నేను ఉన్నానని నాకు తెలుసు. జీవించిన ఈ జ్ఞానం నా నిజాయితీలోనే విలువలను గ్రహిస్తుంది. ఈ నిజాయితీకి న్యాయమూర్తి పరాత్పరుడే.

*

ఒక్క విషయంలో నేను సంపూర్ణంగా నిశ్చయంగా వున్నాను. నేనెవరో నాకు తెలుసు. శ్రీఅరవిందునికి కూడ తెలుసు. అది వారు ప్రకటించారు కూడ... మానవు లందరి విశ్వాసం సైతం ఈ వాస్తవాన్ని మార్చలేవు.

మూలం శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

*

సంపూర్ణ సహాయం

నిజం చెప్పాలంటే, వేలాది సంవత్సరాల పిమ్మట మానవులందరికి ఈ భూమిపై ఒక అవకాశం లభించింది. అది అవసరమైన శక్తితో, స్పృహతో చేసే సహాయం. కర్మపర్యవసానాలను తుడిచిపెట్టడానికి ఏ శక్తీ చాలదు. కొన్ని ప్రత్యేక ప్రక్షాళన ప్రక్రియల ద్వార కర్మను నిశ్శేషం చేస్తే, పర్యవసానాలు మార్చవచ్చు, తుడిచివేయ వచ్చును. కాని విముక్తి ప్రక్రియ అన్ని దశల గుండా పయనించవలసిన అవసరం లేకుండా అతిమానసశక్తితో ఈ కర్మను తుడిచిపెట్టవచ్చును.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

ఈ పుడమి పుట్టిననాటి నుండి, ఎచ్చటనైనా, ఎప్పుడైనా దివ్యచైతన్య కాంతికిరణ ప్రసరణకు అవకాశమేర్పడి నపుడల్లా, నేనక్కడ ఉన్నాను.

శ్రీమాత

అమ్మ అవతార ప్రయోజనం

పృథ్వీచైతన్యం అతిమానసాన్ని తనలోకి స్వీకరించడానికి, దానిని సంభవం చేసే పరివర్తనను మొదట పొందడానికి అమ్మ అవతరించింది. భూమాత చేసుకొన్న ఎన్నో జన్మల పుణ్యం, ఆ భూదేవికి లభించిన సువర్ణావకాశం అమ్మ అవతారం. తదనంతర దశలలో అతిమానసం మరింతగా పరివర్తనను సాధిస్తుంది. కాని మొత్తం భువనచైతన్యమంతా అతిమానసీకృతం కాదు. మనస్సుకు ప్రతినిధి అయిన మనిషి లాగా, అతిమనస్సుకు ప్రాతినిధ్యం వహించే ఒక జాతి మొదట పరిఢవిల్లుతుంది.

*

అతిమానసాన్ని భూమికి తీసుకొని రావడం కోసం అమ్మ వచ్చింది. ఈ అధిరోహణ వల్ల ఆమె పూర్ణ అభివ్యక్తి సాధ్యం అవుతుంది.

*

భగవంతుడు మానవరూపం దాల్చి, బాహ్య మానవప్రకృతిని అనుసరిస్తాడు. మానవాళికి తను అనుసరించిన మార్గం చూపాలి; అది అసలు కారణం. కాని ఆయనలో దివ్యత్వం ఏమాత్రం కనుమరుగవదు. అదొక అభివ్యక్త అద్భుతం. వికాసం పొందుతున్న దివ్యచైతన్యపు అభివ్యక్తి అది. మానవప్రకృతి దివ్య ప్రకృతిగా మారడం కాదు. అమ్మ శైశవదశలో కూడా అంతర్గతంగా మానవాతీత చైతన్యంతో భాసించేది.

*

ఈ విశ్వంలో, వ్యష్టిలో, వ్యష్టికి విశ్వానికి అతీతంగా పనిచేసే ఒక దివ్య చిచ్ఛక్తి వుంది. ఆయా దశలలో శక్తులకు అమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్నది. మానవజీవితాన్ని పరివర్తన చెందించడానికి ఈ ప్రపంచంలో ఇంతవరకు అభివ్యక్తంకాని అతీతశక్తిని తేవడానికి ఆమె మృణ్మయ శరీరంలో పనిచేస్తోంది.

ఆ ప్రయోజనం కోసం పనిచేసే దివ్యశక్తిగా ఆమెను పరిగణించాలి. శరీరంలో ఆమె ఆ శక్తియే. ఆమె మొత్తం చైతన్యంలో భగవంతుని ఇతర అంశాలు కూడా ఇమిడి వున్నాయి.

*

విశ్వాన్ని, విశ్వనియమాలను పరిరక్షించడానికి పనిచేసే విశ్వజీవనశక్తి ఆమె. విశ్వ జనీనతకు అతీతంగా వున్న మహోన్నత భూమికల నుండి మరింత మహనీయమైన

పరివర్తన వస్తుంది. ఆ విశ్వాశీత మహాశక్తిని కార్యరూపంలో పెట్టడం కోసమే అమ్మ అవతార రూపాన్ని ధరించింది.

భువనచైతన్య పరిణామ ప్రస్థానంలో అతిమానస పరివర్తన భగవన్నిర్దేశితం, అనివార్యం. ఈ భూమి ఊర్ధ్వ అధిరోహణ ఆగిపోలేదు. మనస్సు దాని చివరి శిఖరం కాదు. పరివర్తన సంభవం కావాలంటే, ఒక రూపం ధరించి, సుస్థిరం కావాలంటే, భగవద్రోచిర్నివహం దిగివచ్చినప్పుడు దానిని తిరస్కరించకూడదు. దానిని గుర్తించే సంకల్పంతో నిమ్నభూమిక నుండి పిలుపు అవసరం. అంతేగాదు. పరాత్పరుని ఆమోదముద్ర కావాలి. అది అతిముఖ్యం.

ఈ పిలుపునకు, ఆమోదముద్రకు మధ్య మధ్యవర్తిత్వం నెరపే శక్తి దశలు జగన్మాత సాన్నిధ్యం, చిచ్ఛక్తి మహత్వాలు.

మానవ తపస్సు, మానవ ప్రయత్నం కాకుండా, జగన్మాత శక్తి మాత్రమే అడ్డుపడుతున్న యవనికలను విచ్ఛేదం చేసి, నిర్దిష్ట మహామూర్తిమత్వాన్ని తీర్చిదిద్ది, అజ్ఞానం, అసత్యం, మృత్యువు, బాధలు నిండిన ఈ లోకంలోకి చిరంతన మహాసత్యాన్ని, అంతిమ మహత్కాంతిని, భగవంతుని సుధానంద ప్రవాహాలను తీసుకొని వస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

ప్రస్తుత ప్రపంచ జీవనం కంటె ఉన్నతతరమైన అతిమానసస్థితిని పొందుటకై సాగుతున్న పరిణామ భారాన్ని వహించే 'విజ్ఞానమయు' ల జీవనాన్నే దివ్యజీవనం అనటం సముచితంగా ఉంటుంది.

శ్రీఅరవిందులు

శ్రీమాత శక్తులు — మూర్తిమత్త్వములు

వాక్శక్తి — విశ్వ క్షేత్రంలో ఎవరైనా ప్రాపంచిక సంఘటనలలోగానీ మరే ఉద్యమానికిగానీ అధికారం వహించి చైతన్యశక్తి వినియోగిస్తారో వారికి వాక్శక్తి ఉంటుంది. అయితే మీరు చెప్పే మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే నాలుగు కూడా శక్తులే. అవి పరమచైతన్యశక్తియైన దివ్యమాత విశ్వపాలనలో వినియోగించే వివిధ అధికార శక్తులూ, మూర్తిమత్వములూ. అంతేకాక అవి దైవతాలు కూడా; ప్రతి ఒక్కటీ వివిధమైన దైవతత్వాలనూ, వైయక్తిక చైతన్య స్వరూపాలనూ అభివ్యక్తం చేస్తాయి. అగ్రదేవతలంతా కూడా ఈ విధంగా ఆ పరదైవపు మూర్తిమత్త్వాలే. ఒకే దివ్యచైతన్యం అనేక మూర్తులుగా భాసిస్తోంది. 'ఏకమ్ సత్ బహుదా'. ఈ విధంగానే మనిషి కూడా ఒక్కటే కాకుండా అనేక వ్యక్తిత్వాలతో కూడి ఉంటాడు. లోగడ అభిప్రాయపడినట్లుగా కాదు. ఏకకాలంలోనే చైతన్యాలన్నీ ఒకటిగానూ, వివిధంగానూ కూడా ఉండవచ్చు. "శక్తులూ, మూర్తిమత్వాలూ ఒకే ఒకరి భిన్నతత్వాలను వర్ణిస్తాయి. ఒక దివ్యశక్తి అకర్తృకం గాదు, నీవన్నట్లు అవ్యక్తమూ కాదు. పైపెచ్చు అది దైవ ఆవిష్కృత లోకాలలో పనిచేసే ఒక ప్రత్యక్షమూర్తి."

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

(*SABCL* Vol.25:62)

ఇక్కడ యజమాని దైవమే. పనిచేయని ఆత్మ కేవలం నిశ్శబ్ద సాక్షిగానే ఉంటూ అన్నిటినీ బలపరుస్తుంది — ఇది స్థిరస్థితికి సంబంధించినది. శక్తిమాన్యత ద్వారా దైవం పనిచేసే తీరు కూడా ఉంది. అదే శ్రీమాత. ఆమె ద్వారానే సకలమూ సమకూరుతుందనే విషయం నీవు మరువకూడదు.

శ్రీఅరవిందులు

(SABCL 25:69)

అవిద్య — అనృతము

అవిద్య: వియుక్త చైతన్యము, దానితో బాటు ఉండే అహంకార మనస్సు, ప్రాణము. ఇంకా ఆ వియుక్త చైతన్యానికీ, అహంకారిత మనః, ప్రాణాలకు స్వాభావికమైనది అంతా కూడా అవిద్యగా పరిగణన మవుతుంది. అతిమానస తేజస్సు నుంచీ విశ్వప్రజ్ఞ (దివ్యజ్ఞానం) విడిపోయి సత్యాన్ని కోల్పోతూ ఉండే ఒకానొక ప్రక్రియ ఫలితంగా అవిద్య ఏర్పడుతుంది. ఆ విధంగా జీవితసత్యాన్నీ, దివ్యసత్యాన్నీ, శక్తీ, క్రియాశక్తుల సత్యాన్నీ, దివ్యానందపు సత్యాన్నీ కూడా కోల్పోయే ప్రక్రియలో అవిద్య ఏర్పడు తుంది. దాని వల్లనే దివ్యప్రజ్ఞ వెలుగులో సంపూర్ణ సత్య, దివ్యసామరస్య పూరితంగా తయారవాల్సిన ప్రపంచం అవిద్య (అధమ) విశ్వప్రజ్ఞ, పాక్షిక సత్యాలతో అంతా సగం సగం నిజాలతో, అబద్ధాలతో నిర్మితమయింది. ఈ విధంగా అసలు కారణమైన మహాసత్యపు శక్తిని గ్రహించకుండా శంకరాచార్యులు మొదలైన తాత్వికులు దీనిని మాయ అని సిద్ధాంతీకరించారు. ఇదే భగవంతుని మహోన్నత సృజనశక్తిగా భావించారు. సంపూర్ణమైన దివ్యతేజస్సు నుంచి వేర్పడడం వల్ల ఈ సృష్టి చైతన్యంలో ప్రతిదీ పరిచ్ఛిన్నమై గానీ, అక్రమస్థితిలో గానీ ఉంటాయి. అందువల్లనే దాన్ని అవిద్య అన్నారు.

అనృతము అవిద్య కాదు గానీ దాని విపరీత పరిణామం చెప్పవచ్చు. అసురశక్తి వల్ల ఏర్పడిన అసత్యత ఈ సృష్టికి అడుగడుగునా అడ్డుతగులుతూ ఉంటుంది. ఇది సత్యాన్నుంచి విడిపోవటం వల్ల పరిమితమైన జ్ఞానం మాత్రం కలిగి దోషాలకు నిలయంగా ఉండటమే కాక సత్యాన్ని వ్యతిరేకిస్తుంది, లేదా దాన్ని స్వాధీనపరుచుకొని వక్రీకరిస్తూ ఉంటుంది. ఈ విధంగా అసురశక్తియైన ఆ చీకటిశక్తి లేక రాక్షసమాయ తన వక్రచైతన్యమే అసలైన జ్ఞానమని చెపుతూ తానూ మూర్ఖంగా వక్రీభవించిన సత్యాలనే వాస్తవాలుగా చిత్రీకరిస్తుంది. ఈ విధంగా వక్రచైతన్యంతో ఉన్న శక్తులను, మూర్తిమత్త్వాలను మనం దుష్టజీవులు, దుష్టశక్తులు అని వ్యవహరిస్తాము. ఎప్పుడైతే ఈ విధమైన అవిద్యా కల్పిత మూర్తిమత్త్వాలు సత్యంగా చెలామణీ అవుతాయో అదే అసత్యత, అనృతము యోగపరిభాషలో దాన్నే మిథ్య అనీ మోహమనీ అంటారు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

శ్రీమాత శక్తి ఉదారశీలకము, శక్తిమాన్యకము

విశ్వశక్తి అన్నిటినీ చక్కగా నిర్వర్తిస్తుంది, దానికి విరాట్పురుషుని సహకారం ఉంటుంది. అవిద్య ఆవరించిన పరిస్థితుల్లోనే విశ్వశక్తి పని సాగిస్తుంది. అది అధఃప్రవృత్తిగా అనిపిస్తుంది. ఆ అధఃప్రవృత్తి నీచేత తప్పుడు పనులు చేయిస్తుంది. ఇంతకంటే ఉన్నత స్థితికి వెళ్ళాలని నీ అంతట నీవు కోరుకునేవరకూ దైవం ఈ శక్తుల చర్యను అనుమతిస్తుంది. నీవు కనుక సాధకుడవైతే ఈ నిమ్నప్రకృతి చర్యలను అంగీకరించక దాని ద్వారా కాకుండా నీ ద్వారానే పనిచేయమని శ్రీమాతని వేడుకుంటావు. నీవు నీలోని ప్రతి భాగంతోనూ కలిసి కేవలం శ్రీమాతను మాత్రమే శరణుకోరినప్పుడు ఆ దైవం నీ ద్వారా పనిచేస్తాడు.

*

దివ్యచేతనా శక్తి, ఈశ్వరీయశక్తి అయిన విశ్వమాత ఆ పరదైవానికీ అనేకములైన ఆయన వ్యక్తరూపాలకూ సంధానకర్తగా ఉంటుంది. ఒక ప్రక్క తాను దైవం నుంచి తెచ్చిన తేజస్సుల చలనాల చర్యల ద్వారా ఆ పరబ్రహ్మ బహుళ మూర్తులను ఈ విశ్వంలో ఆవిష్కరింపచేస్తుంది. ఇంకా తాను బహిర్గతం చేయగల తత్వంతో వాటినన్నిటినీ అంతర్నిధానము మరియు పరిణామాత్మకంగానూ చేస్తుంది. వేరొక ప్రక్క పునరారోహణ క్రమంలో ఆ తత్వాలన్నిటినీ అవి వచ్చిన చోటకే అంటే ఆ బ్రహ్మతత్వం వైపుకే మళ్ళిస్తుంది. ఆ విధంగా ఆత్మ తన పరిణామక్రమంలో చక్కగా దైవత్వం పొందగలదు, లేదా ఇక్కడే దివ్యగుణాలను సంతరించుకోగలదు. ఆమె ఒక విశ్వరచన చేసినప్పటికీ ప్రకృతి విశ్వశక్తి యొక్క బాహ్యరూపంలో మనకు కనబడే నిశ్చేతనమైన యాంత్రిక సృష్టికర్త్రి లక్షణాలు గానీ, ఒక మిథ్యాభావం గానీ, మాయ అనగానే మనం అనుకున్నట్లు భ్రమలను, భ్రాంతులను కల్పించే దాని లక్షణాలుగానీ కనిపించవు. అది పరబ్రహ్మ నుంచి వచ్చిన బ్రహ్మపదార్థమునకు సంబంధించిన చైతన్యశక్తిగా ఆ అనుభవం పొందుతున్న ఆత్మకు వెంటనే స్పష్టంగా తెలుస్తుంది. ఆమె మనని అజ్ఞానంలోనూ, నిశ్చైతన్యంలోనూ పడేసినట్లు అనిపించినా అది మనం అర్థం చేసుకోలేని ఒక ప్రణాళిక ననుసరించేననీ, ఆమె శక్తులు విశ్వంలో ఉండే అన్ని అస్పష్టశక్తులుగా మనకి కనిపించినప్పటికీ అది త్వరలోనే మనలో దైవ చేతనను పెంపొందించటానికేనని తెలుస్తుంది. ఇంకా ఎంతో ఉన్నతస్థానంలో ఉండి

మనలను తన దగ్గరగా రావించుకొని దివ్యజ్ఞానము, దివ్యసంకల్పము, దివ్యానంద సారములను మనకు బాగా తెలిసేటట్లు చేస్తుంది. అజ్ఞానపు నీడలో ఉన్నప్పుడు కూడా ఆమె చైతన్యాత్మక మార్గదర్శకత్వాన్ని సాధకుని ఆత్మ గమనిస్తుంది. తన నడకకు మెల్లగానూ, వేగంగానూ చేయుతనిస్తూ దగ్గర దారిలోగానీ, చుట్టుదారిలోగాని అంధకారం నుంచి అధికచైతన్యపు వెలుగులోకీ, నశ్వరత్వము నుంచి అమరత్వంలోకీ, బాధ, దుష్టత్వాలనుంచీ ఉన్నత సుఖసంతోషాల వైపుకీ, మనుష్యులు ఊహించటానికి కొంచెం లీలగా మాత్రం తోచే స్థితికి తీసుకొనివెడుతున్నట్లు సాధకుడు గమనిస్తాడు. ఈ విధంగా ఆమె శక్తి ఉదారంగానూ, శక్తిమంతంగానూ, సృజనాత్మకంగానూ, ఫలప్రదంగానూ కూడా ఉంటుంది. సృష్టించే విషయంలో ఉన్నవాటిని ఉన్నట్లుగా గాక, ఉండవలసిన తీరులో నన్న మాట. అంటే అవిద్య పదార్థంతో తయారై, మెలితిరిగి, చిక్కుపడి ఉన్న వ్యక్తి నిమ్న చైతన్య క్రియాశీలతకు స్వస్తి చెప్పి వ్యక్తి ఆత్మను, స్వభావాన్ని ఉన్నత దివ్య ప్రకృతి శక్తితో, పదార్థంతో క్రొత్తగా పునర్నిర్మాణం చేస్తుంది.

మూలం: : శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి)

(SABCL 25:68, CWSA 23:124-25)

భక్తియందలి మర్మము

ప్రస్తుతం ప్రాచుర్యంలో వున్న అన్వయార్థం ప్రకారం నిర్గుణ దైవోపాసన ఖచ్చితంగా భక్తియోగం కాదు. ఎందుచేతనంటే భగవంతుడు, మన స్వీయ అస్తిత్వం ఇద్దరూ ఎందులో లయమైపోయి, ఆరాధించడానికి, ఆరాధించబడటానికి యెవరూ మిగులరో, ఏకత్వపు అనుభవానందమూ, అనంతత్వమూ మాత్రమే మిగులుతాయో, అటువంటి సంపూర్ణ ఐకమత్యం కోసం మాత్రమే నిర్గుణ దైవాన్ని ఉపాసించాలని ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న యోగరూపాలు భావిస్తున్నాయి. కాని ఆధ్యాత్మిక చేతన యొక్క మహిమలను అంత కఠినంగా, అక్షరాలా తర్కబద్ధం చేయగూడదు. అనంతపు ఉనికిని మనం మొదటగా సంవేదించినపుడు మనలోని పరిమిత వ్యక్తిత్వం, దానితో స్పృశించబడినపుడు, అది ఆ స్పర్శకు, పిలుపుకు ఒక విధమైన ఆరాధనాభావంతో

బదులు పలుకుతుంది. తదుపరి ఏకత్వం మరియు ఆనందాల ఒక ఆధ్యాత్మిక స్థితిగా అనంతాన్ని మనం అంతగా పరిగణించవలసిన పని లేదు. లేదా అది మాత్రమే ఆ స్థితికి ఆకారాన్నిచ్చేది, తెలిసేట్లు చేసేది అని కూడా అనుకోవలసిన పని లేదు. కాకపోతే మన చేతన కదొక అనిర్వచనీయ భగవత్తత్వ సాన్నిధ్యంగా గ్రహింపుకొస్తుంది. అటువంటి స్థితిలో కూడా భక్తి ఉపాసనలకు స్థానం ఉంటుంది. మన వ్యక్తిత్వం అనంతంతో ఏకమై అంతర్ధానమైనట్లు కన్పించినా, ఇంకా విశ్వాత్మక దైవం లోనికి, పరాత్పరం లోనికి కరిగిపోయే వైయక్తిక రూప దైవం ఉంటాడు — నిజంగా వున్నాడు. ఆ సంయోగం ద్వారా జరిగే ఐక్యతలో ప్రేమ, ప్రేమించువాడు, ప్రేమించబడువాడు, ఆనందపారవశ్యంలో కరగిపోవు అనుభవంలో తమ్ముతాము మరచిపోతారు. కాని అట్టి ఐక్యతలో ఇంకా ఉపచేతనలా, అంతర్లీనంగా ఆ స్థితిలో కూడా వ్యక్తిత్వ స్మృతి వుంటుంది. భక్తి ద్వారా సంప్రాప్తించే ఆత్మైక్యత అంతా కూడా తప్పక ఈ స్వభావాన్నే కలిగి వుంటుంది. వ్యక్తిగత అంతరాత్మకు భగవంతునికి మధ్య ఆధ్యాత్మిక బాంధవ్యం యొక్క వైవిధ్యభరితమైన అనుభవాల పతాకస్థాయిగా ఈ ఏకత్వానందాన్ని పొందడానికే, ఏకైకమైనది, జగత్తులో అనేకంగా అయ్యింది అని కూడా ఒక అర్థంలో చెప్పుకోవచ్చు మనం.

అయినప్పటికీ ఒక్క నిర్గుణ అనంతుని అన్వేషణ ద్వారా మాత్రమే దైవభక్తి యొక్క మరింత వైవిధ్యమైన మరియు అత్యంత సన్నిహితమైన అనుభవం కలుగదు. ఎందుచేతనంటే మనం ఉపాసించే అధిదేవత మన కత్యంత సన్నిహితం, మనకు స్వంతమై వుండాలి. సగుణమూర్తిత్వం యొక్క సమస్త సంపదలను, మనం నిర్గుణ దైవం యొక్క హృదయంలోనికి పోయినపుడు, అది తనలోనే మనకు వ్యక్తం చేయడం నిర్గుణ దైవానికి సాధ్యమే. అనంత దివ్య ఉనికిలోనికి ప్రవేశించాలని లేదా దానిని ఆలింగనం చేసుకోవాలని మాత్రమే కాంక్షించేవారు, కలనైనా కాంచనటువంటి విషయాలను దాని హృదయంలోనికి పోయినపుడు అచట దర్శించవచ్చు. పరిమితీకరించు బుద్ధి భావనలకు విభ్రమం కలిగించే అద్భుతాలచట అనేకం వున్నాయి. కాని మామూలుగా భక్తిమార్గం ఇంకో చివరి వైపు నుండి ప్రారంభమౌతుంది. దివ్య సగుణోపాసన ద్వారా అది ప్రారంభమై, తనకామోదయోగ్యమైన దాని వైపు యెదిగి విశాలం అవుతుంది. దైవం ఒక పురుషుడు, ఒక అమూర్త అస్తిత్వం మాత్రమే కాదు, లేదా కాలప్రభావానికి లోనుగాని, కాలాతీత విశుద్ధస్థాయి మాత్రమే కాదు.

ఆతడు సమస్తానికీ మూలం, మరియు జగత్తుగా అయిన సత్. కాని పురుషుని చిత్ మరియు ఆనందాల నుండి విడదీయ నలవిగాని సత్ అది. తన స్వీయ సత్‌ను తన ఆనందాన్ని యెరిగిన చిత్ అది. దానిని మనం ఒక దివ్య అనంత పురుషుడని పిలుచుకోవచ్చు. పైగా సమస్త చిత్, శక్తిభరితం. ఎచట పురుషుని యొక్క అనంత చిత్ వుంటుందో, అచట పురుషుని యొక్క అనంత శక్తి వుంటుంది. ఆ శక్తితోనే జగత్తులోని సమస్తం అస్తిత్వం కలిగి వున్నాయి. జీవులన్నీ ఈ దివ్యపురుషుని వల్లనే జీవిస్తున్నాయి. అన్నీ భగవంతుని మోములే. సమస్త ఆలోచన, కర్మ, సంవేదన, ప్రేమ, ఆయన నుండే బయల్వెడలి ఆయన లోనికి తిరిగి చేరుకొంటాయి. వాటన్నింటి ఫలితాలకూ ఆతడే మూలం, ఆధారం, మరియు రహస్య గమ్యం. ఈ అధిదేవునికి, ఈ దివ్యపురుషునికి పూర్ణయోగపు అంశమైన భక్తి ధారపోయబడుతుంది, ఉద్ధరించబడుతుంది. విశ్వాతీతమై అది నిరపేక్ష, ఐకమత్యపు ఫలితమైన ప్రహర్షంలో ఆయనను కాంక్షిస్తుంది. విశ్వజనీనమై, ఆతనిని అనంత సగుణ రూపంలో మరియు ప్రతిరూపంలో, మరియు సమస్త జీవులలో, ఒక విశ్వజనీన ఆనందంతో, భక్తితో కాంక్షిస్తుంది. వ్యక్తిగతమై ఆ భక్తి వ్యక్తికి, వ్యక్తికి మధ్య ప్రేమ పుట్టించే సమస్త మానవసంబంధాలలోకి ప్రవేశిస్తుంది.

హృదయం కాంక్షించే సంపూర్ణ సమగ్రతను ప్రారంభం నుండి అన్నింటియందు సాధించడం సాధ్యం కాకపోవచ్చు. వాస్తవానికి మన గత జీవనవిధానం వల్ల బుద్ధి, మానసిక ప్రవృత్తి, భావోద్వేగ మనస్సు విశాలంగా సున్నితంగా, అది వరకే అభివృద్ధి చెంది ఉన్నట్లయితే అది సాధ్యపడుతుంది. బుద్ధి, ఉత్తమాభిరుచి, భావోద్వేగ మనస్సు, సంకల్పం మరియు కర్మ ద్వారా అనుభవానికి సంబంధించిన మన ఇతర భాగాల ద్వారా విస్తృతమయ్యే సంస్కృతి వైపుకు దారితీయడమే మామూలు జీవితానుభవం యొక్క ఉద్దేశ్యం. తన స్వీయాభివ్యక్తి కోసం సన్నద్ధం చేస్తున్న 'తత్' యొక్క సమస్త సత్యానికి తేలికగా హృదయం ఉన్మీలనం కాగలిగేటట్లు అది మామూలు జీవిని విశాలం చేస్తుంది, పరిశుద్ధం చేస్తుంది. సాధారణంగా మనిషి తన అస్తిత్వపు భాగాలన్నింటిలో పరిమితుడై వుంటాడు. మొదట్లో అతని స్వభావానికి, దాని గత అభివృద్ధి సాంగత్యాలకు నిష్కల్మష సంబంధం వుండి వున్నంత మేర మాత్రమే అతడు దివ్యసత్యాన్ని గ్రహించగలడు. అందుచేత భగవంతుడు మొదట్లో, దివ్యలక్షణాల, దివ్యస్వభావాల పరిమిత ధృవీకరణల ద్వారా మన కెదురు పడ్తాడు. అన్వేషించేవానికి,

అతడు అర్థం చేసుకోగల విషయాల నిరపేక్షతత్వంగా, వాని సంకల్పం, హృదయం, వేటికి బదులు పలుకగలవో, అట్టి విషయాల సమగ్ర సంపూర్ణతగా, భగవంతుడు తనను తాను, భక్తుని ముందు ప్రకటించుకొంటాడు. తన దైవత్వం యొక్క ఏదో ఒక నామాన్ని, ఒక పార్శ్వాన్ని అతనికి తెలియజేస్తాడు. దీన్నే యోగంలో 'ఇష్టదేవత' అంటారు ఉపాసనకు మన స్వభావం ఎన్నుకొన్న నామరూపాలు. ఈ భగవత్తత్వాన్ని తన ప్రతిభాగంతోనూ ఆలింగనం చేసుకొనేందుకు, ఉపాసకునికి ఒక సజీవ దేహంగా తయారయ్యే భగవంతుని పార్శ్వాలకు, గుణాలకు బదులుపలికే ఒక రూపంతో అది ప్రకటితమౌతుంది. అటువంటి రూపాలే విష్ణు, శివ, కృష్ణ, కాళి, దుర్గ, క్రైస్తు, బుద్ధుడు. ఈ రూపాలనే మానవ మనస్సు తన ఉపాసనకు స్వీకరిస్తుంది. నిరాకార భగవత్తత్వాన్ని ఆరాధించు ఏకేశ్వరోపాసకుడు సైతం, ఏదో గుణానికి సంబంధించిన రూపాన్ని, ఏదో ఒక మానసిక రూపాన్ని లేదా విశ్వప్రకృతి యొక్క రూపాన్ని అత నికి కట్టబెడ్తాడు. తద్వారా అతడు, ఆ యిష్టదేవతను వూహించి ఆ వైపుకు పయనిస్తాడు. కాని దైవం యొక్క ఒక సజీవ దేహాన్ని, నిజం చెప్పాలంటే, ఒక మానసిక దేహాన్ని దర్శించగలగడం అనేది ఉపాసకుని అన్వేషణలో, భగవంతునికి అతనికి మధ్య ఒక గొప్ప మధురమైన సాన్నిహిత్యాన్ని కలుగజేస్తుంది.

ఇష్టదేవతాభావాన్ని విశ్వాత్మకం చేయడానికి, నానావిధ మరియు ఒక సర్వాలింగక బాంధవ్యం ద్వారా తన ఒక్కనికే స్వాధీనమైన వ్యక్తిగా అతనిని చేసుకొనేందుకు, సమస్త సత్తాకు అతడు చేరువలో ఉండేందుకు, మొత్తం సత్తాను ఆతనికి అంకితం చేయడానికి, నివేదన చేయడానికి, అర్పణ చేయడానికి, పూర్ణయోగపు భక్తిమార్గం వుంది. ఆలా జరిగినపుడు ఆతడు మనకు సమీపంలో, మనలో నివసిస్తాడు, మనం అతనితో, అతనిలో నివసిస్తాము. అన్నింటి యందు సదా ఆయనను చింతించడం, సదా అయనను దర్శించడం అంటే మనన, దర్శనాలు, ఈ భక్తి మార్గానికి తప్పనిసరి. విశ్వప్రకృతిలోని భౌతికవస్తువుల వైపు మనం చూచినపుడు మన భక్తికి సంబంధించిన దివ్యమైన ఉద్దేశ్యాన్నే చూడాలి. మనుష్యులు, జీవుల వైపు చూచినపుడు వాటిలో ఆతనిని దర్శించాలి. వాటితో మనకున్న బాంధవ్యంలో ఆతని రూపాలతో సంబంధం లోనికి ప్రవేశిస్తున్నామన్నట్లు వాటిలో ఆతనిని దర్శించాలి. పదార్థ ప్రపంచంపు పరి మితిని ఛేదించి ఆవలకు పోయి ఇతర భూమికలకు సంబంధించిన జీవులను తెలుసు కొన్నప్పుడు లేదా వాటితో సంబంధం పెట్టుకొన్నప్పుడు, యింకా అదే భావం,

అదే అంతర్దృష్టి మన మనస్సులకు నిజం కావాలి. కేవలం పదార్థ సంబంధమైన, పైకి కన్పించే ఆకారానికి, వైకల్యం చేయబడిన సాధారణ సంబంధానికి మాత్రమే ఉన్మీలనమై లోపలనున్న అధిదైవతాన్ని అలక్ష్యం చేసే మన మనస్సుల మామూలు అలవాటు, భక్ష్యానందాలకు, సర్వాన్ని నిరంతరం అక్కున జేర్చుకొనే అలవాటుకు, ప్రగాఢమైన, విస్తృతమైన అవగాహనకు దాసోహమనాలి. మన హృదయంతో, సమస్త అస్తిత్వంతో ఆరాధించే ఈ ఏకైక భగవంతుని సమస్త దేవతలలో మనం దర్శించాలి. అవన్నీ ఈతని దివ్యత్వపు రూపాలే. మన ఆధ్యాత్మిక ఆలింగనం అలా విశాలమై మనం ఒకానొక నిర్దిష్ట ప్రాంతానికి చేరుకొంటాం. అచట సమస్తాన్నీ ఆతనిగా, ఈ చేతన యొక్క ఆనందంగా, ఈ ప్రపంచాన్ని మనం నిరభ్యంతరంగా చూడడం మన మామూలు విధానం అవుతుంది. అతనితో మన సంయోగం యొక్క బాహ్య సంబంధమైన లేదా విషయగత, విశ్వజనీనతను మనకు ప్రాప్తింపజేస్తుంది.

తన స్వధామంలో నివసిస్తున్నట్లు మనలో నివసిస్తూ ఆతని సన్నిధి యొక్క మాధుర్యంతో మన హృదయాల నలరిస్తూ, మన అస్తిత్వపు శిఖరం నుండి ఒక సఖునిలా, గురువులా, ప్రియునిలా, మన మానసిక జీవనకార్యకలాపాల నన్నింటిపై ఆధిపత్యం వహిస్తూ, జగత్తులో పైనుండి మనను తనతో ఏకం చేసుకొంటూ, అంతరంగంలో దివ్యప్రియుని ప్రతిరూపం, అంతర్నేత్రానికి దృశ్యమానం చేసుకోగలిగేటట్లు తయారు కావాలి. ఆంతరంలో ఆతనితో సదా సంబంధం కలిగి వుండడమే ఆనందం. ఆనందం ఇంకా సన్నిహితంగా శాశ్వతంగా, నిర్విఘ్నంగా కొనసాగేటట్లు చేసుకోవాలి. మన మామూలు వ్యాపకాల నుండి, మనం మనలోనికి పూర్తిగా ఉపసంహరించుకొన్నపుడు లేదా మన మానవ కార్యకలాపాలను విడచివేసి కాంక్షించడం ద్వారా పొందే ఒక విశిష్ట సామీప్యతకు, ఉపాసనకు ఈ సంసర్గం కట్టువడకూడదు. అతడు అధికాధికంగా మన లోనికి దిగివచ్చి, వాటన్నింటి యందు ప్రత్యక్షంగా నిలిచి ఆతని సమస్త సంకల్పంతో, శక్తితో, ఆతని వెలుగుతో, జ్ఞానంతో, ఆతని ప్రేమ, ఆనందాలతో వాటి యందు వ్యాపించివుండే విధంగా మన భావాలు, ప్రేరేపణలు, సంవేదనలు, కర్మలు అన్నింటినీ ఆతని సమ్మతి కోసం, లేక నిరాకరణ కోసం, ఆయన ముందుంచాలి. లేదా ఇంకా మనం ఈ స్థితికి చేరకపోయినట్లైతే ఆకాంక్షా యజ్ఞంలో వాటిని ఆయనకు అర్పించివేయాలి. చివరకు మనం ఉపాసించే దైవం యొక్క అస్తిత్వానికి మన స్వీయజీవితాలకు మధ్య ఇహనేమాత్రం విభజన లేనివిధంగా మన ఆలోచనలు,

సంవేదనలు, ప్రేరేపణలు, కర్మలు అన్నీ అతని నుండి వెలువడ నారంభమై, తమంత తాముగా ఏదో ఒక దివ్యబీజంగా, రూపంగా మార్చుచెందుతాయి. మన ఆంతరిక జీవనం మొత్తంలో ఆతని అస్తిత్వం యొక్క ఒక అంశగా మనం మనల్ని యెరుగగల స్థితి కెదగాలి. అలాగే సమస్త సంభావ్యతలనూ, మన దివ్యప్రేమికుని వ్యవహారాలగానే చూసి ఆనందిస్తే, విషాదం, వ్యధలు, భౌతిక బాధలు కూడా అతని కానుకలై ఆనందంగా మారి దైవస్పర్శతో హతమై చివరకు ఆనందంలో అంతర్ధానమౌతాయి. ఎందుకనంటే అతని హస్తస్పర్శ ఒక అద్భుత రూపాంతరీకరణపు పరుసవేది. విషాదం బాధలతో కలుషితమైనదని కొందరు జీవితాన్ని తిరస్కరిస్తారు. కాని భగవద్భక్తునికి విషాదం, బాధ ఆతనిని కలుసుకొనే సాధనోపాయాలు, భక్తునిపై కలిగే వత్తిడిని తెలిపే ముద్రలు. చివరకు సార్వత్రిక ఆనందపు ఈ మారువేషాలకు దానిని మరుగుపరచడం, ఏమాత్రం సాధ్యం కాని విధంగా ఆతని స్వభావంతో మన ఐకమత్యం అత్యంత సంపూర్ణమవు తుంది. అవి దివ్యానందంగా మార్పుచెందుతాయి.

ఈ ఐకమత్యాన్ని కలిగించే సమస్త బాంధవ్యాలూ ఈ మార్గం మీద తీవ్రతరంగా, ఆనందకరంగా, వ్యక్తిగతమైనవిగా తయారౌతాయి. చివరకు వీటన్నింటినీ భరించి స్వీకరించడమో లేదా వాటి నన్నింటినీ ఏకం చేయడమో చేసేదే ప్రేయసీప్రియుల అనుబంధం. ఎందుచేతనంటే అది అన్నింటినీ మించిన అత్యంత తీవ్రతరమైన మరియు ఆనందకరమైన సంబంధం. అది తక్కిన సమస్తాన్నీ దాని శిఖరాలకు ఉద్ధ రించి వాటిని అతిశయించి వుంటుంది. ఆతడే గురువు, మార్గదర్శి, జ్ఞానం వైపు నడుపువాడు. ఆంతరిక వెలుగు, దృష్టి, అభివృద్ధికి సంబంధించిన ప్రతిదశ యందూ మన మనస్సు అనే బంకమట్టికి రూపం కల్పిస్తున్న ఒక కళాకారుని హస్తస్పర్శలా ఆతని స్పర్శను సంవేదిస్తాం. సత్యాన్నీ, దాని వాక్కునూ వ్యక్తపరచే ఆతని కంఠ స్వరాన్ని మనం బదులుపలికేటట్లు ఆతని భావనను, మన అజ్ఞానం యొక్క అంధకా రాన్ని పారద్రోలే ఆతని వెలుగు యొక్క ఈటెల్లాంటి మెరుపులను మనం సంవేదిస్తాం. మనస్సుకు సంబంధించిన పాక్షిక వెలుగులు, దివ్యజ్ఞానం యొక్క వెలుగుల లోనికి రూపాంతరం చెందిన దానికి తగిన నిష్పత్తిలో, అది ఏమాత్రం అల్పం లేక గొప్ప స్థాయిలో సంభవించినా మన మనస్తత్వం ఆతని మనస్తత్వంగా రూపాంతరం చెందించబడినట్లు, మరింతగా ఆతడు మనలోని చింతనాపరునిగా, ద్రష్టగా తయారై నట్లు సంవేదిస్తాం. మనం మన కోసం ఆలోచించడం, చూడడం, చేయం, కాని

మనం మన కోసం దేన్ని ఆలోచించాలని ఆతడు సంకల్పిస్తాడో దాన్నే ఆలోచిస్తాం. మనం మన కోసం దేన్ని చూడాలని ఆతడు సంకల్పిస్తాడో దాన్నే చూస్తాం. అపుడు గురువు ప్రియునిలో సాఫల్యం చెందుతాడు. ఆతడు ఆలింగనం చేసుకొని వశం చేసుకొనేందుకు, భోగించి ఉపయోగించుకొనేందుకు మన సమస్త మానసిక అస్తిత్వం మీద ఆతని హస్తాల నుంచుతాడు.

ఆతడు గురువు, కాని ఈ విధమైన గమనంలో దూరము, ఎడబాటు, సంభ్రమం, భయం, కేవల విధేయత, అంతర్ధానమైపోతాయి. ఎందుచేతనంటే ఇవి కలకాలం నిలిచి వుండలేని విధంగా, మనం ఆతనికి అత్యంత సన్నిహితమై ఆతనితో ఏకమైపోయే టట్లు తయారౌతాం. మన అస్తిత్వాన్ని స్వీకరిస్తూ, ఆక్రమిస్తూ, ఉపయోగిస్తూ ఆతడు తన సంకల్పానుసారం దానితో ఏం చేయాలనుకొంటాడో అదే చేస్తాడు. విధేయత దాసుని చిహ్నం. కాని ఈ సంబంధంలో దాస్యం అత్యంత నిమ్నస్థాయికి చెందినది. ఆ తరువాత మనం దాసుని విధేయతను పాటించం. సంగీత కళాకారుని వ్రేలికి తంత్రి బదులు పలికినట్లు, ఆతని సంకల్పాన్ననుసరించి నడుస్తాం. ఉపకరణంగా నిలువడం, ఉపకరణమైపోవడం ఆత్మసమర్పణకు అనుకూలమైన ఉన్నతస్థాయి. కాని ఇదొక సజీవమైన, ప్రేమించే ఉపకరణం. అది భగవంతుని బానిసగా తయారయ్యే మన అస్తిత్వం యొక్క మొత్తం స్వభావం. తనంత తాను దైవానికి వశమై, ఆ బంధానికి, ఆతని పెత్తనానికి తాను స్వయంగా ఆనందంతో లొంగిపోయి ఆనందిస్తూ ఉండడం యిది. ఒక ఆవేశపూరిత ఆనందంతో, దాని నతడు ఏం చేయాలని సంకల్పిస్తాడో దానినంతా ప్రశ్నించకుండా, చేసుకుంటూ పోతుంది. ఆతడు దానిచే మోయించాలనుకొన్నదాన్నంతా మోస్తూ వుంటుంది, ఎందుకనంటే అది భరించేది ప్రియుని ... బరువు, భారాన్నే.

కష్టం నుండి, కలత నుండి రక్షించే స్నేహితుడు, సలహాదారు, సహాయకుడు, శత్రువుల నుండి రక్షించేవాడు, సంగ్రామంలో మన కండగా పోరాడే యోధుడు, లేదా ఎవరి రక్షణ క్రింద మనం పోరాడుతామో ఆతడే అతడు. మన మార్గాలలో మనల్ని తీసుకొనిపోవు రథసారథి, ముందుకు క్షేమంగా నడిపించేవాడు ఆతడు. ఇచట అంటే ఈ స్థితికి చేరిన వెన్వెంటనే ఆతనితో ఒక సన్నిహిత ఆంతరిక సాన్నిహిత్యంలోనికి చేరుకొంటాం. అప్పుడతడు మన సహచరుడు, శాశ్వతంగా మనకు తోడుండేవాడు అవుతాడు, జీవనక్రీడలో సహక్రీడకారుడవుతాడు. ఎంత సంతోషం

కలిగించినా, మిత్రత్వం నెరపినా, ఉపకారం అనేది అందులో కన్పిస్తుండడం చేత అది చాలా పరిమితమైపోతుంది. ప్రియుడు గాయపరచవచ్చు, విడిచిపెట్టవచ్చు, మనపై కోపగించవచ్చు, మనల్ని కాదన్నట్లుండవచ్చు. అయినా మన భక్తి నిలిచే వుంటుంది. అంతేగాదు ఈ వ్యతిరేకతల వల్ల పెరగనూ పెరుగవచ్చు. అవి పునస్సమాగమానందాన్ని, తిరిగి పరస్పరం వశులుగావడం లోని ఆనందాన్ని అధికం చేయవచ్చు. వాటి ద్వారా ప్రియుడు స్నేహితుడిగా ఉండిపోతాడు, చివరకు ఆతడు చేసినదంతా మన అస్తిత్వం యొక్క ప్రియునిచే, సహాయకునిచే, మన పరిపూర్ణతకు, అలాగే మనలో ఆతని ఆనందం కోసం చేయబడినట్లు తెలుసుకుంటాం. ఈ వైరుధ్యాలు ఒక గొప్ప సాన్నిహిత్యానికి దారితీస్తాయి. మన అస్తిత్వం యొక్క తండ్రి, తల్లి కూడా ఆతడే. దాని మూలం, దానిని రక్షించేవాడు, దానిని తనదిగా చేసుకొని తృప్తిపరచువాడు, మన కోర్కెలను తీర్చువాడు ఆతడే. మనం మనదనుకొని మనం పెంచి పోషించే మన కోర్కెకు పుట్టిన బిడ్డ ఆతడు. వీటన్నింటినీ, ఈ బాంధవ్యాల నన్నింటినీ ప్రియుడు ఆమోదిస్తాడు, స్వీకరిస్తాడు. సన్నిహితత్వాన్నీ, ఏకత్వాన్నీ కలిగించిన ఆతని ప్రేమలో పితృ, మాతృ, రక్షణ రెండూ వుంటాయి. ఆ ప్రేమ మీద మనం కలిగించే వత్తిడులకు అది తనకు తాను లొంగిపోతుంది. అట్టి ప్రగాఢమైన, బహుపార్శ్వ బాంధవ్యంలో సమస్తం ఒకటై పోతాయి.

ప్రారంభం నుండి కూడా ఈ ప్రేయసీప్రియుల, అతి సన్నిహితమైన అనుబంధాన్ని కలిగి వుండడం సాధ్యమే. కాని పూర్తిగా పారవశ్యం కలిగించే భక్తిమార్గాలకు ప్రత్యేకించి ఇదే మార్గమైనట్లు పూర్ణయోగి ప్రత్యేకించి అనుసరించవలసిన మార్గం కాలేదిది. అతడు జ్ఞానాన్ని, కర్మను కూడా అనుసరిస్తాడు గనుక, గురువుగా, సఖునిగా దైవం యొక్క అవసరం అతనికున్నది గనుక, ప్రారంభం నుండీ ఇతర సంబంధాల ఛాయలకు సంబంధించిన దేన్నో కొంత పూర్ణయోగం స్వీకరిస్తుంది. భగవంతుని యెడల భక్తి వికసించడంతో పాటు, అతనిలో భగవంతునికి సంబంధించిన జ్ఞానవిస్తృతి, దివ్యసంకల్పానికి సంబంధించిన కర్మ అతని స్వభావంలో, జీవనంలో ప్రతిఫలిస్తూ వుండాలి. దివ్యప్రేమికుడు తనంత తానుగా వాటిలో తెలుపుకుంటాడు, జీవితాన్ని వశం చేసుకొంటాడు. అయినా గాని అసలైన సంబంధం భక్తికి సంబంధించినదే. దాని నుండే సమస్తమూ బహిర్గతమౌతాయి. ఆ వేగభరితమైన భక్తి, సంపూర్ణ భక్తి, తన సాఫల్యత కొరకు వందల కొలది మార్గాలను అన్వేషిస్తుంది. పరస్పరం వశులు

గావడానికి ప్రతి ఉపాయాన్నీ స్వీకరిస్తుంది, ఐకమత్యానందపు వేనవేల మోముల ద్వారా అన్వేషిస్తుంది. మనఃకల్పిత సమస్త భేదాలు, దాని అడ్డంకులన్నీ, దాని 'కాదు, కూడదు' లన్నీ, తర్కసంబంధ నిస్సార విశ్లేషణలన్నీ ఈ భక్తిచే పరిహసించబడ్డాయి. లేదా అవన్నీ ఐకమత్యాన్ని పరీక్షించే పరీక్షలుగా, క్షేత్రాలుగా, ద్వారాలుగా మాత్రమే ఉపయోగించబడ్డాయి. అనేక విధాలుగా మనకు భక్తి యేర్పడుతుంది. దివ్యప్రేమికుని సౌందర్యానికి మేలుకొనడంలా, ఆతని ఆదర్శవంతమైన మోము, మరియు ప్రతిరూప సందర్శనం ద్వారా, ప్రపంచంలోని వస్తువుల సహస్ర మోముల వెనుక నుండి మనకు అందించు మార్మిక సూచనల ద్వారా, హృదయం యొక్క కాలాంతర లేక ఆకస్మిక అవసరం వల్ల జీవునిలోని అస్పష్ట తృష్ణ వల్ల, మనకతి సమీపంలో వుండి మనల్నెవరో తమ వైపు ఆకర్షిస్తున్నారనే భావం వల్ల, లేదా మనం పరిశోధించి తెలుసుకోవలసిన ఎవరో ఆనందమయ, సుందరరూపులు మన వెంట పడుతుండడం వల్ల మనకు భక్తి కలుగుతుంది.

అనురాగావేశంతో మనం ఆతనిని కాంక్షిస్తూ, అదృశ్యుడైన దివ్యప్రియుని వెంట పడతాం. ఎవరిని గురించైతే మనం చింతించను గూడా చింతించమో, ఆ ప్రియుడు మన వెంట పడవచ్చు. మొదట్లో మనం సంకల్పించినా, సంకల్పించక పోయినా, తన స్వంతానికై ప్రపంచంలోనే, మనల్ని ఆవేశించి తన వశం చేసుకొ వచ్చు. ప్రారంభంలో ఒక శత్రువులాగా కూడా, ప్రేమపూరిత ఆగ్రహంతో అతడు మనల్ని పైకొనవచ్చు. ఆతనితో మన తొట్ట తొలి సంబంధాలు ఒక సమరం, ఒక సంఘర్షణలా వుండవచ్చు. ఎచట ప్రేమ, ఆకర్షణ వుంటాయో అచట మొదట్లో ఆ దైవం ఈ జీవుని మధ్య సంబంధాలు చాలా కాలం వరకు అపార్థాలతో, అపనమ్మకాలతో, ఈర్ష్య, ద్వేషం, సంఘర్షణ, ప్రేమతగవులు, ఆశానిరాశలు, వియోగం, ఎడబాటులకు సంబంధించిన బాధలతో వడిదుడుకులకు లోనవుతూ వుంటాయి. హృదయావేశాలన్నింటినీ కేవల ప్రహర్షానందాల లోనికి, ఏకత్వం లోనికి పరిశుద్ధం చేయబడేంతవరకు ఆతనికి వ్యతిరేకంగా వాటిని ఆతని పైకి విసురుతాము. అందులో కూడా, వైవిధ్యత లేకుండా వుండదు. దివ్యప్రేమానందం యొక్క శాశ్వత వైవిధ్యాన్నంతా, కేవల ఐకమత్యాన్నంతా తెలియజేయడం, మానవభాషకు సాధ్యం కాదు. మన ఉన్నత మరియు నిమ్న భాగాలు అంతరాత్మ కేమీ తీసిపోకుండా, మనస్సు జీవనం అన్నింటినీ అది వరదలా ముంచెత్తుతుంది. భౌతిక దేహం కూడా ఆ ఆనందంలో తన వంతుగా

పాలు పంచుకొంటుంది, ఆతని స్పర్శ ననుభవిస్తుంది. దాని సర్వాంగాలు, సిరలు, నాడులు, ఆనందామృత ప్రవాహంతో నిండిపోతాయి. దివ్యప్రేమ ఆనందం, అస్తిత్వం యొక్క చివరి మాట, రహస్యాలకు రహస్యం, గుహ్యాతిగుహ్యం.

ఆ విధంగా విశ్వాత్మకమూ, వ్యక్త్యాత్మకమూ అయినదై తీవ్రతర స్థాయిల కుద్ధరించబడి, సర్వవ్యాపకం చేయబడి, సర్వ-ఆలింగకమై సర్వసమృద్ధమైన భక్తి, ఆనందాల మార్గం సర్వోన్నత ముక్తిని ప్రసాదిస్తుంది. దాని తరంగ శిఖరం ఒక విశ్వాతీత ఏకత్వం. కాని భక్తికి ముక్తి అంటే సంపూర్ణ ఐకమత్యం. ముక్తి అంటే దానికి వేరే అర్థం లేదు. అందులోనే దానికి అన్ని రకాలైన ముక్తి కలిసి వున్నది లభిస్తుంది. లేదా చివర్లో, కొన్ని విధానాలకున్నట్లు ఒకదాని తరువాత ఒకటిగానే అవి ప్రాప్తిస్తాయి గనుక, ఒకదాని కొకటి సంబంధం లేనిదై విడివడి వుంటుంది అంటారు. అందులో మానవాత్మ శక్తితో దైవం యొక్క పరిపూర్ణ ఐకమత్యం, అంటే సాయుజ్య ముక్తి వుంటుంది. అందులో భిన్నత్వం మీద ఆధారపడే దానంతటికి సంబంధించినదిచట ఏది వున్నదో అది తనను వ్యక్తం చేసుకొంటుంది — కాని అక్కడ భేదమంతా ఏకత్వం యొక్క ఒక రూపమే — అదే ఆనందం. సన్నిహితత్వానికి, సంపర్కానికి పరస్పర సాన్నిధ్యానికి, సామీప్య, సాలోక్య ముక్తి అందులో వున్నాయి. ఒకదానిలో ఒకటి ప్రతిబింబించడం అంటే మనం ఒకే రూపమని చెప్పుకొనే సాదృశ్య ముక్తి మరి ఇతర అద్భుత విషయాలు కూడా అందులో వున్నాయి. వాటికి భాష ఇంకా పేరు పెట్టలేకపోయింది. భగవద్భక్తునికి అందుబాటులో లేనిదీ, లేక అతనికి తిరస్కరించబడిందంటూ ఏదీ లేనే లేదు. ఎందుచేతనంటే దివ్యప్రియుని కాతడు ఇష్టుడు, దివ్యప్రేమికుని ఆత్మ అతడు.

మూలం: శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

(*The Synthesis of Yoga, CWSA,* Vol. 24, pp. 599-606)